వీలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492



www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక






హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 125 | ఎడిటర్ : తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి | అక్టోబర్ 2024 | వెల : రూ 10/-




## పలు యూనివర్సిటీలకు వీసీల నియామకం

- ఓయూ విసిగా ఎం కుమార్
- తెలుగు వర్సిటీ విసిగా నిత్యానందరావు
- కేయూ వీసీగా ప్రతాప్‌రెడ్డి
- వ్యవసాయ వర్సిటీ వీసీగా అల్దాస్ జానయ్య
- 9 వర్సిటీలకు ఉపకులపతుల నియామకం
- ఉత్తర్వులు జారీ చేసిన గవర్నర్

హైదరాబాద్

తెలంగాణలో పలు యూనివర్శిటీలకు కొత్త వైస్ చాన్సలర్స్ లను నియమిస్తూ శుక్రవారం రాష్ట్ర గవర్నర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది మార్చి 21తో విసిల పదవీకాలం ముగియడంతో ప్రస్తుతం అన్ని యూనివర్శిటీలకు ఇన్‌చార్జ్ విసిలుగా ఐఎఎస్‌లు వ్యవహరిస్తున్నారు. బాసర ట్రిపుల్

-మిగతా 3 లో



## యదాతథంగా గ్రూప్-1 మెయిన్స్ ఎగ్జామ్

- సింగిల్ బెంచ్ తీర్పును సమర్థించిన డివిజన్ బెంచ్
- వాయిదా కోరుతూ వేసిన పిటిషన్ల డిస్మిస్
- సుప్రీంను ఆశ్రయించిన పలువురు అభ్యర్థులు

హైదరాబాద్,

తెలంగాణ గ్రూప్ 1 పరీక్ష రాసే అభ్యర్థులకు రాష్ట్ర హైకోర్టు బిగ్ షాక్ ఇచ్చింది . గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షకు హైకోర్టు డివిజన్ బెంచ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పరీక్షలు వాయిదా వేయాలన్న గ్రూప్ - 1 అభ్యర్థుల రిట్ అప్పీల్‌ను

-మిగతా 3 లో

## స్కిల్ యూనివర్సిటీకి ఆదానీ గ్రూప్ భారీ విరాళం



- వందకోట్ల చెక్కును స్వయంగా అందించిన ఆదానీ
- హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌ను కలిసి అందచేత

హైదరాబాద్,

:తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి అదానీ గ్రూప్ భారీ విరాళం ప్రకటించింది. అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ శుక్రవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి రూ.100 కోట్ల చెక్కును అందజేశారు. సీఎస్ శాంతి కుమారి, పురపాలక ముఖ్యకార్యదర్శి

-మిగతా 3 లో



## 20న వారణాసిలో ప్రధాని పర్యటన

### పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

వారణాసి,

భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అక్టోబర్ 20న తన సొంత పార్లమెంటరీ నియోజకవర్గమైన వారణాసిలో పర్యటించనున్నారు. సుమారు ఆరు గంటలపాటు కాశీలోనే బస చేయనున్నారు. ఉత్తరాదిన పెద్ద పండుగగా జరుపుకునే దీపావళి పర్వదినానికి కొద్ది రోజుల ముందే వారణాసితో సహా దేశవ్యాప్తంగా రూ. 3,254.03 కోట్ల విలువైన ప్రాజెక్ట్‌లను

-మిగతా 3 లో



## సుప్రీంకోర్టు కేసుల విచారణ లైవ్ స్ట్రీమింగ్

- వాదనలు తీర్పులు చూడొచ్చు..
- ప్రత్యేక యాప్ ద్వారా వీక్షించేలా ఏర్పాట్లు
- అధికారికంగా ప్రకటించిన చీఫ్ జస్టిస్ డివై చంద్ర చూడ్

న్యూఢిల్లీ,

సుప్రీంకోర్టు చరిత్రలో మరో కొత్త అధ్యాయం మొదలు కానుంది. ఇకపై సుప్రీంలో జరిగే అన్ని కేసుల విచారణను లైవ్ స్ట్రీమింగ్ చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందుకోసం రూపొందించిన యాప్‌ను ప్రయోగాత్మకంగా పరీక్షించారు. ఈ క్రమంలో

-మిగతా 3 లో



## ముందు డ్రైనేజీ సమస్య పరిష్కరించండి

మూసీ సుందరీకరణపై కిషన్ రెడ్డి వ్యాఖ్య

హైదరాబాద్,

డ్రైనేజీ సమస్య పరిష్కారం కాకుండా మూసీ సుందరీకరణ జరగదని కేంద్రమంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. తెలంగాణలోని 30 శాతం జనాభా హైదరాబాద్‌లోనే ఉందన్నారు. మూసీ

-మిగతా 3 లో



## రేవంత్ కుర్చీకి ఎసరు పెడుతున్నారు

- హైడ్రా, మూసీ, గ్రూప్-1 విషయాల్లో జాగ్రత్త
- కేంద్రమంత్రి బండి సంజయ్ సచలన వ్యాఖ్యలు

కరీంనగర్,

సిఎం రేవంత్ కుర్చీకి ఎసరు పెడుతున్నారు..మై_డ్రా, మూసీ, గ్రూప్-1 విషయాల్లో జాగ్రత్త పడాలి..అంటూ కేంద్రమంత్రి బండి సంజయ్ సచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్‌ను పదవి నుంచి దింపేందుకు కాంగ్రెస్‌లోని కొందరు

-మిగతా 3 లో

## అపరిచితుడిలా మాట్లాడుతున్న రేవంత్



- మూసీపై రోజుకో మాటతో ప్రజల్లో గందరగోళం
- మూసీని మురికికూపంగా చేసిన ఘనత కాంగ్రెస్‌దే
- మూసీలో వరదలు వచ్చినా..నీళ్లునిలిచే ప్రసక్తే లేదు
- పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన కెటిఆర్



హైదరాబాద్,

మూసీ సుందరీకరణపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రోజుకో మాట మాట్లాడుతూ.. అపరిచితుడిలాగా మారిపోయాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. మూసీ సుందరీకరణ చేస్తాం అని మొట్టమొదట చెప్పిందే రేవంత్ రెడ్డి.. కానీ నిన్న ప్రెస్ మీట్లో అసలు సుందరీకరణ మాట ఎక్కడి నుంచి వచ్చిందని అంటున్నాడని కేటీఆర్ ÷ర్ అయ్యారు. తెలంగాణ భవన్‌లో మూసీపై కేటీఆర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రేవంత్ రెడ్డి ఒక రోజు సుందరీకరణ అంటాడు..

-మిగతా 3 లో

## మూసీ పునరావాస మహిళా సంఘాలకు చేయూత



- రూ.3.44కోట్ల నగదు చెక్కులు పంపిణీ
- వారికి అండగా ఉంటామన్న మంత్రి మంత్రి సీతక్క

హైదరాబాద్,

మూసీ పరివాహక ప్రాంతాల్లో నివసిస్తున్న వారికి పునరావాసం కల్పించి, వారి ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం

-మిగతా 3 లో

# ఇషా ఫౌండేషన్‌పై కేసు కొట్టేసిన సుప్రీం



తరంగాలు న్యూఢిల్లీ

సద్గురు జగ్గీ వాసుదేవ్ నిర్వహిస్తున్న ఇషా ఫౌండేషన్‌పై నమోదైన హెబియస్ కార్పస్ కార్యకలాపాలను సుప్రీం కోర్టు శుక్రవారం విరమించుకుంది. 42, 39ఏళ్ళ వయస్సున్న తన ఇద్దరు కుమార్తెలను ఆ స్వచ్ఛంద ఆధ్యాత్మిక సంస్థ బందీలుగా వుంచిందని ఆరోపిస్తూ 70ఏళ్ల వృద్ధుడు హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. మద్రాసు హైకోర్టులో ప్రారంభమైన ఈ కార్యకలాపాలు సుప్రీం కోర్టుకు చేరాయి. అయితే ఆ ఇద్దరు యువతులు తమ అభీష్టం మేరకే తాము సన్యాసినులుగా జీవిస్తూ ఇషా ఫౌండేషన్‌లో వున్నామని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోర్టుకు వ్యక్తిగతంగా తెలియచేయడంతో కోర్టు ఈ చర్యలను తీసుకోవాల్సి వచ్చింది. తమను కలిసిన తమిళనాడు పోలీసుల కు కూడా వారీ విషయం తెలియచేశారు. వారు మేజర్లు అయినందున తల్లిదండ్రులుగా మీరు వారిని నియం త్రించలేరు. పైగా తల్లిదండ్రులు, పెరిగిన పిల్లల మధ్య వుండా ల్సిన వ్యక్తిగత బంధాలను చట్టపరమైన తీర్పులు, చర్యలు ద్వారా నిర్దేశించలేరని ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ పేర్కొన్నారు. ఆ మహిళలను బందీలుగా వుంచితే కోర్టు సర్వ శక్తులను ఒడ్డి చర్యలు తీసుకునేదని, కానీ వారు తాము బందీలం కాదని, తమను ఎవరూ ఒత్తిడి చేయలేరని స్పష్టం చేసిన తర్వాత ఈ నిర్ధారణకు రావాల్సి వచ్చిందని సిజెఐ తెలిపారు.

## 22, 23 తేదీల్లో రష్యాలో ప్రధాని మోడీ పర్యటన



తరంగాలు న్యూఢిల్లీ

ఈ నెల 22, 23 తేదీల్లో ప్రధాని నరేంద్ర మోడీ రష్యాలో పర్యటించనున్నారు. కజన్‌లో జరగనున్న 16వ బ్రిక్స్ సదస్సులో పాల్గొనాల్సిందిగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఆహ్వానించిన మేరకు ఈ పర్యటన ఖరారైందని విదేశాంగ శాఖ వర్గాలు శుక్రవారం తెలిపాయి. ఈ సదస్సు నేపథ్యంలో బ్రిక్స్ సభ్య దేశాల ప్రతినిధులతో మోడీ ద్వైపాక్షిక సమా వేశాలు జరుపుతారని భావిస్తున్నారు. ”అంతర్జా తీయ అభివృద్ధి, భద్రతల కోసం బహుళవాదాన్ని బలోపేతం చేయడం” అన్నది ఈ ఏడాది సదస్సు ప్రధాన ఉద్దేశంగా వుంది. కీలకమైన అంతర్జా తీయ సమస్యలపై చర్చించేందుకు ఇదొక ముఖ్య వేదిక కానుందని విదేశాంగ శాఖ వర్గాలు తెలిపాయి. బ్రిక్స్ దేశాలు చేపట్టిన పలు చొరవల పురోగతిని సమీక్షించేందుకు ఇదొక విలువైన అవకాశమని, అలాగే భవిష్యత్ సహకారానికి ముఖ్యమైన రంగాలను గుర్తించడానికి కూడా వీలు వుంటుందని ఆ వర్గాలు పేర్కొన్నాయి.

# బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్‌కు బెదిరింపులు

-5కోట్లు డిమాండ్ చేస్తూ పోలీసులకు మెసేజ్
-అప్రమత్తం అయిన పోలీసులు..మెసేజ్‌పై ఆరా



తరంగాలు ముంబై,

బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ కు మరోసారి బెదిరింపులు వచ్చాయి. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో ఉన్న వైరానికి ముగింపు పలకాలంటే రూ.5 కోట్లు ఇవ్వాలంటూ అగంతకులు బెదిరింపులకు పాల్పడ్డారు. ముంబయి ట్రాఫిక్ పోలీసుల వాట్సప్ నంబర్‌కు ఈ మెసేజ్ రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. గురువారం రాత్రి ముంబయి ట్రాఫిక్ పోలీసులకు ఈ మెసేజ్ వచ్చింది. 'ఈ బెదిరింపులను తేలిగ్గా తీసుకోవద్దు. సల్మాన్ ఖాన్ ప్రాణాలతో ఉండాలన్నా.. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో శత్రుత్వాన్ని ముగించుకోవాలన్నా ఆయన రూ.5కోట్లు చెల్లించాలి. ఈ డబ్బులు ఇవ్వకపోతే ఇటీవల హత్యకు గురైన మాజీ ఎమ్మెల్యే సిద్ధిఖీ కంటే ఆయన దారుణమైన పరిస్థితులు ఎదుర్కోవాల్సి ఉంటుందని దుండగులు అందులో బెదిరించారు. దీనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించామని, మెసేజ్ ఎక్కడినుంచి వచ్చిందన్న దానిపై విచారణ జరుపుతున్నామని ముంబయి పోలీసులు వెల్లడించారు. ఈనేపథ్యంలో బాంద్రాలోని ఆయన నివాసం వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. కాగా.. సల్మాన్‌ఖాన్‌కు ఇలా బెదిరింపులు రావడం ఇదే తొలిసారి కాదు. గతంలోనూ పలుమార్లు బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి ఆయనకు బెదిరింపులు వచ్చాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో సల్మాన్ నివాసం ఉంటున్న బాంద్రాలోని గెలాక్సీ అపార్ట్‌మెంట్ వద్ద ఇద్దరు వ్యక్తులు కాల్పులు జరిపిన సంగతి తెలిసిందే. ఇక, అంతకుముందు పన్వేల్ ఫామ్‌హౌస్‌లోకి చొరబడేందుకు కొందరు ప్రయత్నించడం అప్పట్లో కలకలం రేపింది. నటుడి ప్రాణాలకు ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో గతేడాది మహారాష్ట్ర ప్రభుత్వం ఆయనకు భద్రతను పెంచింది. ఇదిలాఉండగా.. సల్మాన్ ఖాన్ స్నేహితుడు, ఎన్సీపీ నేత బాబా సిద్ధిఖీ గతవారం దారుణ హత్యకు గురైన సంగతి తెలిసిందే. ముంబయిలోని బాంద్రాలో తన కుమారుడి కార్యాలయంలో ఉండగా.. ముగ్గురు దుండగులు సిద్ధిఖీపై మూడు రౌండ్లు కాల్పులు జరిపారు. వెంటనే ఆయన్ను లీలావతి ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ హత్య తామే చేసినట్లు బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటించుకుంది.

## ఆలయాలపై దాడులు జరుగుతున్నా చర్యలేవీ

-కాంగ్రెస్ సర్కార్ తీరుపై మండిపడ్డ ఈటెల



తరంగాలుహైదరాబాద్,

గత నెల రోజులలో.. తెలంగాణాలో 6 హిందూ దేవాలయాలపై దాడులు జరగడంపై నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాలని మల్కాజిగిరి ఎంపి ఈటెల రాజేందర్ అన్నారు. ఇంతకన్నా దారుణం ఉంటుందా అని అన్నారు. దీనిపై ఎలాంటి చర్యలు తీసుకోక పోవడం సిగ్గుచేటన్నారు. సికింద్రాబాద్ లో ముత్యాలమ్మ అమ్మవారి విగ్రాహాన్ని ధ్వంసం చేసిన వాడు, చావు దెబ్బలు తిని అరెస్ట్ అయిన తరువాత కూడా ఏమి మారకుండా హాస్పిటల్ లో నుండి సోషల్ మీడియాలో విద్వేష పూరిత పోస్టులు పెట్టగలిగిండు అంటే.. ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా ఉందో అర్థం అవుతుందని అన్నారు. ఈ మేరకు కాంగ్రెస్ సర్కార్ పై ఈటెల రాజేందర్ విమర్శలు గుప్పించారు. ప్రజల దృష్టిలో.. హిందూ సమాజానికి ఈ ప్రభుత్వం రక్షణ ఇవ్వగలదనే నమ్మకం కోల్పోయిందని అన్నారు. ఈ మతోన్మాద దాడులకు, ప్రభుత్వ చేతగానితనానికి నిరసనగా ప్రజలు సికింద్రాబాద్ బంద్ కు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఈటెల ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. తోణం ఆలయ విధ్వంసలకులపై చర్యలు తీసుకోవాలని అన్నారు.

# వయనాడ్‌లో రంగంలోకి సిపిఐ అభ్యర్ధి

-ప్రియాంకపై పోటీ పడనున్న సత్యన్ మోకెరి






తరంగాలు తిరువనంతపురం,

వయనాడ్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేయనున్న ప్రియాంక గాంధీ పై సిపిఐ అభ్యర్థిని నిలపనుంది. కేరళలోని వాయనాడ్ నుంచి ప్రియాంక పోటీ చేస్తున్న సంగతి తెలిసిందే. వామపక్షాలు సీనియర్ సిపిఐ నాయకుడు, మాజీ శాసనసభ్యుడు సత్యన్ మోకెరి(70)ని పోటీకి నిలబెట్టింది. రాహుల్ గాంధీ తన వాయనాడ్ సీటును ఖాళీ చేయడంతో ఆ సీటుకు ఇప్పుడు ఉపఎన్నిక జరుగబోతున్నది. అయితే గమనించాల్సిన విశేషమేమిటంటే ఇది ప్రియాంక గాంధీ తొలిసారి పోటీ చేస్తున్న ఎన్నికల ఘట్టం. సిపిఐ స్టేట్ కౌన్సిల్ గురువారం సమావేశమై సత్యన్ మోకెరి విషయంలో నిర్ణయం తీసుకుంది. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బినయ్ విశ్వం మాట్లాడుతూ ' మోకెరి పూర్తి స్థాయిలో పోటీపడతారు. ఆయన దేశంలో జరిగిన అనేక రైతు ఉద్యమాలకు నాయకత్వం వహించారు. మేము సీనియర్ రైతు నాయకుడిని ఎల్ డిఎఫ్ అభ్యర్థిగా వాయనాడ్ నుంచి నిలబెడుతున్నాము' అన్నారు.మోకెరి ప్రస్తుతం ఆల్ ఇండియా కిసాన్ సభకు జాతీయ కార్యదర్శిగా ఉన్నారు. అది సిపిఐ రైతు విభాగం. పైగా మోకెరి కొజికోడ్ జిల్లాకు చెందిన స్థానిక వాసి. ఆయన 1987 నుంచి 2001 వరకు మూడుసార్లు శాసనసభ్యుడిగా పనిచేశారు. ఆయన నందపురం అసెంబ్లీ సీటు కు ప్రాతినిధ్యం వహించారు. మోకెరి పార్టీ విద్యార్థి విభాగం 'ఆల్ ఇండియా స్టూడెంట్ ఫెడరేషన్' నుంచి పార్టీలో చేరారు. ఆయన 'స్టేట్ అగ్రికల్చరల్ డెట్ రిలీఫ్ కమిషన్' సభ్యుడిగా కూడా పనిచేశారు. మోకెరి 2014లో కూడా వాయనాడ్ నుంచి లోక్ సభకు పోటీ చేశారు. నాడు ఆయన కాంగ్రెస్ సిట్టింగ్ ఎంపీ ఎం.ఐ. షానవాస్ చేతిలో 20870 ఓట్ల తేడాతో ఓడిపోయారు.ఆయన తన ప్రచారం శనివారం నుంచి కొనసాగిస్తానన్నారు. 'వాయనాడ్ ప్రజలు ఎల్లప్పుడూ వామపక్ష ఉద్యమానికి తోడుగా నిలబడ్డారు. మేము రాజకీయ విధానంలోనే ఓటర్ల వద్దకు వెళ్లి ఓట్లడుగుతాము' అన్నారు.

## శ్రీశైలానికి భారీగా వరదనీరు

-ఒక్కగేటు ఎత్తి నీటి విడుదల




తరంగాలు ంద్యాల,

ఎగువన కురుస్తున్న వర్షాలకు శ్రీశైలానికి జలాశయానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. శుక్రవారం ప్రాజెక్టుకు జలకళ సంతరించుకుంది. ఒక క్రస్టు గేటు 10 అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నిండా నీళ్లు, గేట్లు ఎత్తడంతో దిగువకు వస్తున్న నీళ్లతో ప్రాజెక్టు పరిసర ప్రాంతాలు కనుల విందు చేస్తుంది. శ్రీశైలం ప్రాజక్టు పరిసర ప్రాంతాల్లో ప్రకృతి అందాలను చూసి ఎంజాయ్ చేస్తున్నారు. శ్రీశైలం జలాశయానికి వచ్చి చేరుతున్న వరద నీటితో ఇన్ ఫ్లో పెరిగింది. ప్రస్తుతం ఇన్ ఫ్లో 93వేల 270 క్యూసెక్కులుంది. ప్రాజెక్టు పూర్తి స్థాయినీటి మట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 884.50 అడుగులకు చేరింది. ప్రాజక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.8070 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 212.9198 టీఎంసీలు నీటి నిల్వ ఉంది. శ్రీశైలం ప్రాజెక్టు కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల్లోరెండింటిలోనూ విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. గేట్ల ద్వారా ఔట్ ఫ్లో 95వేల 626 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు అధికారులు.

# తిరుమల భక్తులకు శుభవార్త

-జనవరి ఆర్జిత సేవాటిక్కెట్లు
-నేడు విడుదల చేయనున్న టిటిడి



తరంగాలుతిరుమల,

ప్రపంచవ్యాప్తంగా తిరుమల శ్రీవారికి కోట్లాది మంది భక్తులున్నారు. వారంతా ఏడాదిలో ఏదో ఒక రోజులో.. ఆయన్ని దర్శించుకునేందుకు తిరుమలకు తరలి వస్తారు. ఆ క్రమంలో భక్తుల సౌకర్యార్థం తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) వివిధ చర్యలు చేపట్టింది. వారిని దృష్టిలో ఉంచుకుని శ్రీవారి సుప్రభాత సేవ నుంచి ఏకాంత సేవ వరకు ఉన్న పలు సేవా టికెట్లను టీటీడీ విక్రయిస్తుంది. ఆ క్రమంలో 2025 జనవరికి సంబంధించిన శ్రీవారి ఆర్జిత సేవలు, దర్శన టికెట్ల కోటాను అక్టోబర్‌లో టీటీడీ అందుబాటులోకి తీసుకురానుంది. అందులోభాగంగా తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించి జనవరి కోటాను శనివారం ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) విడుదల చేయనుంది. సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం అక్టోబరు 21వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకో వచ్చని టీటీడీ ప్రకటించింది. అయితే ఈ టికెట్లు పొందిన భక్తులు అక్టోబర్ 21వ తేదీ నుంచి 23వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లించాల్సి ఉంటుందని తెలిపింది. ఇక వారికి లక్కీడిప్‌లో టికెట్లు మంజూరవుతాయని వివరించింది. కళ్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవా టికెట్లను అక్టోబర్ 22న ఉదయం 10 గంటలకు విడుదల చేస్తామని వివరించింది. వర్షాకాలం కావడంతో.. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. ఇక తిరుమలలో సైతం భారీగా వర్షం పడుతుంది. దీంతో తిరుపతి చుట్టుపక్కన ఆవరించిన ఏడుకొండలు సైతం పచ్చదనాన్ని పరుచుకుంది. ఓ వైపు వరుస సెలవులు రావడం.. వాతావరణం అహ్లాదకరంగా మారడంతో తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా క్యూ కడుతున్నారు.

# యదాతథంగా గ్రూప్-1 మెయిన్స్ ఎగ్జామ్

(మొదటి తరువాయి)

హైకోర్టు డివిజన్ బెంచ్ కొట్టేసింది. సింగిల్ బెంచ్ తీర్పును డివిజన్ బెంచ్ సమర్థించింది. దీంతో ఈ నెల 21వ తేదీ నుంచి 27వ తేదీ వరకు గ్రూప్ - 1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 46 పరీక్షాలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. 31,383 మంది అభ్యర్థులు గ్రూప్ 1 పరీక్షకు హాజరు కానున్నారు. పరీక్షా కేంద్రాలకు 200 మీటర్ల దూరంలో ఆంక్షలు అధికారులు విధించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఐదుగురికన్నా ఎక్కువ మంది గుమికూడరాదని హెచ్చరించారు. ఇదిలాఉంటే.. తెలంగాణ గ్రూప్ 1 అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. జీవో 29ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జీవో 29 వల్ల జరిగే నష్టాన్ని ప్రధాన న్యాయమూర్తికి తమ న్యాయవాది వివరించారని విద్యార్థులు చెప్పారు. సోమవారం రోజు మొదటి కేసుగా తీసుకొని విచారిస్తామని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ ప్రకటిస్తూ విచారణను వాయిదా వేశారు. జీవో 55నే అమలు చేయాలని విద్యార్థులంతా కోరినా.. సీఎం పెడచెవిన పెట్టారని గ్రూప్ 1 అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సుప్రీంకోర్టుతో మొట్టికాయలు కొట్టించుకోక ముందే ప్రభుత్వం దిగివచ్చి జీవో 29ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. హైడ్రా గురించి మాట్లాడుతున్న సీఎం.. జీవో 29 వల్ల నష్టపోయే విద్యార్థుల గురించి ఎందుకు స్పందించడం లేదని గ్రూప్ 1 అభ్యర్థులు నిలదీస్తున్నారు. హైదరాబాద్ అశోక్ నగర్‌లో ఇప్పటికే పోలీసులు దాడులు చేస్తున్నారని గ్రూప్ 1 అభ్యర్థులు వాపోయారు. గ్రూప్ 1 చదివే విద్యార్థులపై దాడులు చేస్తూ.. పోలీస్ స్టేషన్‌లో ఉంచి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కోర్టు తీర్పు వచ్చే వరకు గ్రూప్ 1 మెయిన్స్ రద్దు చేయాల్సిందేనని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణ 2.0 ఉద్యమాన్ని మళ్లీ చూస్తారంటూ రేవంత్ సర్కార్‌ను విద్యార్థులు హెచ్చరించారు. జీవో 29 గ్రూప్ 1 విద్యార్థులకు శాపంగా మారిందన్నారు. సీఎం మొండిగా ఎందుకు వెళ్తున్నారో చెప్పాలన్నారు. రాజ్యాంగాన్ని కాపాడాలని రాహుల్ గాంధీ చెప్తుంటే, రేవంత్ రెడ్డేమో ఆ స్ఫూర్తిని తుంగలో తొక్కేలా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2022లో కేసీఆర్ జీవో 55 తెచ్చారని.. గ్రూప్ 1 లో రిజర్వేషన్లు అమలు అయ్యేలా తీసుకొచ్చారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక జీవో 29 తీసుకొచ్చారని.. దీని వల్ల గ్రూప్ 1 అభ్యర్థులకు నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టులో న్యాయం జరుగుతుందనే ఆశాభావం ఉందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అశోక్ నగర్ వచ్చి విద్యార్థులతో మాట్లాడి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# స్కిల్ యూనివర్సిటీకి ఆదానీ గ్రూప్ భారీ విరాళం

(మొదటి తరువాయి)

దానకిశోర్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. యువతకు నైపుణ్యాలు నేర్పించేలా రంగారెడ్డి జిల్లాలో ముచ్చర్లలోని బేగరికంచెలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ఈ వర్సిటీకి శంకుస్థాపన చేశారు. దీనికి మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రాను చైర్మన్‌గా నియమించారు. 17 రకాల కోర్సుల్లో యువతకు శిక్షణ ఇచ్చి ప్రైవేటు సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. ఏటా లక్షమందికి శిక్షణ ఇచ్చేలా రాబోయే కాలంలో ఈ వర్సిటీని విస్తరించనున్నారు. బేగరికంచెలో సొంత భవనం పూర్తయ్యే వరకు గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా భవనంలో వర్సిటీ కార్యకలాపాలు కొనసాగనున్నాయి. ఈ ఏడాది నుంచే ప్రవేశాలు కల్పించే ఉద్దేశంతో ఇప్పటికే దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. నవంబరు 4వ తేదీ నుంచి స్కిల్ యూనివర్సిటీలో కోర్సులు ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతానికి ప్రాధాన్యం ఉన్న ఆరు కోర్సులతో మొదలు పెట్టి క్రమంగా కోర్సులను పెంచనున్నారు. ఈ వర్సిటీకి ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్‌మహీంద్రా చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం దీనికోసం వందకోట్లు కేటాయించింది. ఈ క్రమంలో అదానీ గ్రూప్ చైర్మన్ గౌతం అదానీ నేతృత్వంలో ఓ ప్రతినిధులు బృందం శుక్రవారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలుసుకుంది. తెలంగాణలో స్కిల్స్ యూనివర్శిటీని ఏర్పాటు చేయడానికి తెలంగాణ ప్రభుత్వానికి రూ. 100 కోట్లను విరాళంగా ఇచ్చారు. దానికి సంబంధించిన చెక్కును అదానీ సిఎం రేవంత్ రెడ్డికి స్వయంగా అందజేశారు. లాజిస్టిక్స్ అండ్ ఈ-కామర్స్, హెల్త్‌కేర్, స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్స్ అండ్ లైఫ్ సైన్సెస్ అడ్మిషన్ పక్రియ పూర్తైంది. టీచింగ్ సైతం నడుస్తోంది. ఈ సందర్భాంగా తెలంగాణ సీఎం ఎక్స్‌లో ట్వీట్ చేశారు. 'అదానీ గ్రూప్ సంస్థల చైర్మన్ శ్రీ గౌతమ్ అదాని గారు మర్యాదపూర్వకంగా కలిశారు. అదానీ ఫౌండేషన్ నుంచి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి రూ.100కోట్ల విరాళం చెక్కు రూపంలో అందజేశారు.' అని ముఖ్యమంత్రి ట్వీట్‌లో పేర్కొన్నారు.

# పలు యూనివర్సిటీలకు వీసీల నియామకం

(మొదటి తరువాయి)

ఐటి, మహిళా యూనివర్శిటీ మినహా రాష్ట్ర వ్యాప్తంగా మిగిలిన 10 యూనివర్శిటీలకు తెలంగాణ ప్రభుత్వం గతంలో సెర్చ్ కమిటీలను నియమించింది. ఈ కమిటీలు దరఖాస్తులను పరిశీలించి ఒక్కో యూనివర్శిటీకి ముగ్గురి పేర్లను గవర్నర్‌కి సిఫారసు చేస్తాయి. పది విసి పోస్టులకు 312 మంది దరఖాస్తు చేసుకున్నారు. కొత్తగా నియమితులైె విసిల్లో అనుభవం, కులాలను పరిగణనలోకి తీసుకున్నట్లు అర్థం అవుతోంది. ఇందులో పాలమూరు యూనివర్శిటీ విసిగా జి.ఎస్. శ్రీనివాస్, కాకతీయ యూనివర్శిటీ విసిగా ప్రతాప్ రెడ్డి, ఉస్మానియా యూనివర్శిటీ విసిగా ఎం. కుమార్, శాతవాహన వర్శిటీ విసిగా ఉమేష్ కుమార్ తెలుగు వర్సిటీ విసిగా నిత్యానందరావు, మహాత్మాగాంధీ వర్శిటీ విసిగా అల్తాఫ్ హుస్సేన్, తెలంగాణ యూనివర్శిటీ విసిగా యాదగిరి రావు, జయశంకర్ వర్శిటీ విసిగా జానయ్య,శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ హార్టీకల్చర్ వర్శిటీ విసిగా రాజిరెడ్డిలు నియమితులయ్యారు. ప్రభుత్వ సూచనలతో గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా.. తెలంగాణలో చాలా కాలంగా వీసీల పోస్టులు ఖాళీగా ఉన్న విషయం తెలిసిందే. దాదాపు ఏడాదిన్నర కాలంగా వీసీలు లేకుండా పోయారు. అంతేకాదు ఇన్‌చార్జ్ వీసీలుగా సీనియర్ ఐఏఎస్‌లను నియమించినప్పటికీ వర్సిటీలో పరిస్థితి ఏమాత్రం మారలేదు. వీసీలు లేక అనేక యూనివర్సిటీల్లో పాలన గాడి తప్పినట్లైంది. పలు వర్సిటీల్లో అక్రమాలు జరిగాయని కూడా ఆరోపణలు వచ్చాయి. సరైన వసతులు లేక అనేకసార్లు విద్యార్థులు ఆందోళనబాట పట్టిన విషయం తెలిసిందే. తమ సమస్యలు పరిష్కరించాలని కొత్త వీసీలను నియమించాలని విద్యార్థులు పట్టుబట్టినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. వసతి గృహాల్లో పరిస్థితి మరీ అధ్వాన్నంగా మారింది. హాస్టల్స్‌లో సరైన భోజన సదుపాయం లేక, నాణ్యమైన ఆహారం లేక విద్యార్థులు అవస్థలు పడ్డ సందర్భాలు ఎన్నో. అంతేకాకుండా హాస్టల్స్‌లో విషపు పురుగులు తిరుగుతుండటంతో విద్యార్థులు మరింత భయాందోళనకు గురైన పరిస్థితులు ఉన్నాయి.అలాగే వీసీ పోస్టుల కోసం అనేక మంది ప్రొఫెసర్లు పైరవీలు చేసినట్లు సమాచారం. చివరకు ఎట్టకేలకు వీసీల నియామకంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తొమ్మిది యూనివర్సిటీలకు వీసీలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త వీసీల ఆధ్వర్యంలో యూనివర్సిటీల్లో పరిస్థితి మారుతుందని ప్రభుత్వం ఆశిస్తోంది.

# అపరిచితుడిలా మాట్లాడుతున్న రేవంత్

(మొదటి తరువాయి)

మరొక రోజు ప్రక్షాళన అంటాడు.. మరో రోజు పునరుజ్జీవం అంటాడు అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. మూసీ సుందరీకరణ అనే మాట మొట్టమొదటు వాడింది రేవంత్ రెడ్డి. గోపన్‌పల్లిలో మాట్లాడుతూ లక్షన్నర కోట్లతో మూసీ సుందరీకరణ చేస్తామని చెప్పారు. కానీ ఇవాళ ఆయన ఒక అపరిచితుడిలా మారారు. ఆయన నోట్లో నుంచి అబద్దాలు వస్తున్నాయి. లక్షన్నర కోట్లు ఎవరు అన్నారని అంటుండు. నల్లగొండకు మంచినీళ్లు ఇస్తుంటే మీకు మనసున పడుతలేదా అంటున్నాడు. నల్లగొండ జిల్లా ప్రజలను రెచ్చగొడుతున్నాడని కేటీఆర్ ధ్వజమెత్తారు. మూసీ ప్రక్షాళన ఇష్టం లేదని మీరంటే ఖర్చు పెట్టిన రూ. 140 కోట్లు నా ఆస్తి అమ్మైన కడుతా అని రేవంత్ రెడ్డి అంటున్నాడు. రేవంత్ రెడ్డి అఫిడవిట్‌లో ఏమో రూ. 30 కోట్లే తన ఆస్తి అని చూపించాడు. మరి రూ. 140 కోట్లు తమ్ముడి స్వచ్ బయో కంపెనీ నుండి తేస్తాడా, బావమరిది అమృత్ కంపెనీ నుండి అమృతం ఏమైనా జుర్రుతాడా? అని కేటీఆర్ విమర్శించారు. మూసీ మురికి కూపంగా మారిందన్న సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలతో ఏకీభవిస్తున్నా.. మూసీని మురికి కూపంగా మార్చింది కచ్చితంగా గత పాలకులే.. అందులో సింహభాగం కాంగ్రెస్ ప్రభుత్వానిది అయితే.. కొద్దిభాగం టీడీపీ ప్రభుత్వానికి కూడా దక్కుతుందని కేటీఆర్ పేర్కొన్నారు. మూసీ స్టోరీ ఏంటని ఆలోచిస్తే.. మూసీ నది కృష్ణానదికి ఉపనది. పైన అనంతగిరి కొండల్లో ముచ్‌కుంద వద్ద మూసీ ఉద్భవించింది. 267 కి.మీ. ప్రయాణం చేసి హైదరాబాద్ నగరం మీదుగా వాడపల్లి వద్ద కృష్ణా నదిలో కలుస్తుంది. 1591లో కులీకుతుబ్ షా హైదరాబాద్ నగరాన్ని మూసీ తీరాన నిర్మించారు. రెండు నదులుగా మూసా ఈసాగా ప్రారంభమై.. హైదరాబాద్‌లోని బాపు ఘాట్ వద్ద మూసీ నదిగా ఏర్పడుతాయి. గతంలో ఈ నదిని ముచ్‌కుంద అని కూడా పిలిచేవారు. 1908లో మూసీలో ఒక భయంకరమైన వరద వచ్చింది. కుంభవృష్టి లాంటి వర్షం పడడం కారణంగా అతి పెద్ద వరద సంభవించి 15 వేల మంది మరణించారు. చాలా మంది ఇబ్బంది పడ్డారు. నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ హైదరాబాద్ ప్రజలను వరద నుంచి కాపాడాలని చెప్పి.. నాటి ప్రముఖ ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్యను పిలిచి చర్చించారు. నాడు ఆయన డిజైన్ చేసింది ఉస్మాన్ సాగర్(గండిపేట) 1920లో పూర్తయింది, హిమాయాత్ సాగర్ 1927లో పూర్తయింది. ఈ రెండింటి రిజర్వాయర్ల వెనుక ఒక ఉద్దేశం ఉంది. ఒకటి హైదరాబాద్ ప్రజలకు మంచినీరు అందించడం, రెండోది భారీగా వరదలు వచ్చిన వాటిని ఆపేందుకు, హైదరాబాద్‌లో ఆవాసాలు మునగకుండా, ప్రాణ ఆస్తి నష్టం కలగకుండా.. రక్షణ కవచం లాగా ఉండాలనే ఉద్దేశంతో ఈ రెండు రిజర్వాయర్లు నిర్మించారు. ఆ తర్వాత 95 ఏండ్ల పాటు మూసీలో ఏ ప్రభుత్వం గొప్పగా పని చేసింది లేదు అని కేటీఆర్ తెలిపారు. మూసీకి ఒక ప్రత్యేకత ఉంది. పశ్చిమం నుంచి తూర్పు వైపునకు ప్రవహిస్తోంది. పశ్చిమాన ఉండే మంచిరేవుల వద్ద తీసుకుంటే.. ఈస్ట్‌లో ఉండే ఓఆర్ఆర్ దాకా 57.5 కిలోమీటర్లలో 84 మీటర్ల కిందకు ఫాస్ట్‌గా ప్రవహిస్తుంది. ఇది ప్రకృతి ప్రసాదించిన వరంగా చెప్పొచ్చు. వరద వేగంగా కిందకు జాలువారుతుంది. రెండోది గతంలో ఉన్న ఎంసీహెచ్, 2007-08లో ఏర్పడ్డ జీహెచ్ఎంసీ కానీ.. ఈ పరిధి తీసుకుంటే 90 శాతం రెయిన్ వాటర్, 90 శాతం సీవరేజ్ కానీ గ్రావిటీ ద్వారా మూసీలోకి వస్తుంది. 54 ప్రధాన నాలాలు ఉన్నాయి. అవన్నీ కూడా 90 శాతానికి పైగా గ్రావిటీ రూపంలో ఉన్నాయి. నాచారం, జీడిమెట్ల, బాలానగర్, మల్లాపూర్ నుంచి కొన్ని వ్యర్థాలు 90 శాతానికి పైగా మూసీలో కలుస్తున్నాయి. మూసీలో ఒక్క చుక్క నీరు వదిలినా నిల్వదు.. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ గేట్లు ఎత్తినా జరజర నీరు కిందకు పోతోంది. అలా మోక్షగుండం విశ్వేశ్వరయ్య రిజర్వాయర్లను ప్లాన్ చేశారు. ఎలాంటి ఉపద్రవం లేకుండా బ్యాలెన్సింగ్‌గా రూపొందించారు. ప్రాణ నష్టం లేకుండా కాపాడుకోవచ్చు అని చాలా ముందు చూపుతో మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ ఈ రెండు రిజర్వాయర్లను కట్టించారని కేటీఆర్ గుర్తు చేశారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చాక సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు రిపోర్టు తెప్పించుకున్నాం. మూసీ మురికికూపంగా మారింది. బీవోడీ, సీవోడీ ఈ రెండింటిలో కూడా మూసీ ప్రమాదభరితమైన స్థాయిలో ఉందని రిపోర్టులో చెప్పారు. 2016 దాకా మున్సిపల్ మినిస్టర్‌గా కేసీఆర్ ఉన్నారు. ఆ తర్వాత నేను మున్సిపల్ మంత్రిగా బాధ్యతలు తీసుకున్నాను. కేసీఆర్ మార్గదర్శకత్వంలో అక్కడ ఉండే పరిస్థితులను అధ్యయనం చేసి పునరుజ్జీవం, సుందరీకరణ చేసే విధంగా సంకల్పించాం అని కేటీఆర్ తెలిపారు.

## 20న వారణాసిలో ప్రధాని పర్యటన

(మొదటి తరువాయి)

చేపట్టనున్నారు. రూ.380.13 కోట్లతో 15 ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం, రూ.2,874.17 కోట్లతో రెండు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. వారణాసి పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ సిగ్రా స్పోర్ట్స్ స్టేడియంలో బహిరంగ సభలో కూడా ప్రసంగిస్తారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వారణాసి నుంచే దేశంలోని 6 విమానాశ్రయాలను అభివృద్ధి చేసే ప్రాజెక్టులను ప్రారంభిస్తారు. బాగ్‌డోగ్రా (బెంగాల్), దర్భంగా (బీహార్), ఆగ్రా (యూపీ) విమానాశ్రయాల్లో కొత్త సివిల్ ఎన్‌క్లేవ్‌ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. వాటి అంచనా వ్యయం రూ.3,041 కోట్లు. ఇది కాకుండా, రేవా ఎయిర్‌పోర్ట్‌లో కొత్త టెర్మినల్ బిల్డింగ్ నిర్మాణం, మా మహామాయ ఎయిర్‌పోర్ట్ అంబికాపూర్‌లో కొత్త టెర్మినల్ బిల్డింగ్ నిర్మాణం, సర్సావా ఎయిర్‌పోర్ట్‌లో సివిల్ ఎన్‌క్లేవ్ నిర్మాణ ప్రాజెక్టులను ఆయన వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారు. వీటి కోసం రూ.255.18 కోట్లు ఖర్చు చేయనున్నారు.

## రేవంత్ కుర్చీకి ఎసరు పెడుతున్నారు

(మొదటి తరువాయి)

మంత్రులు ప్రయత్నిస్తున్నారని కేంద్రమంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సీఎం పీఠం నుంచి దించాలని కాంగ్రెస్ మంత్రులు చూస్తున్నారని షాకింగ్ కామెంట్స్ చేశారు. గోతికాడ నక్కలా రేవంత్‌ను దింపేయాలని కుట్ర చేస్తున్నారని అన్నారు. హైడ్రా, మూసీ, గ్రూప్-1 విషయంలో జాగ్రత్త పడకపోతే.. రేవంత్ రెడ్డికు చిక్కులు తప్పవని బండి సంజయ్ అన్నారు. జనంలో రేవంత్‌కు వ్యతిరేకత రావాలని కాంగ్రెస్ ప్రభుత్వ మంత్రులే చూస్తున్నారని అన్నారు. గ్రూప్-1 అభ్యర్థుల మీద దాడులు చేయడం దారుణమని చెప్పారు. గ్రూప్-1 అభ్యర్థులు చేసిన తప్పేంటీ అని ప్రశ్నించారు. ప్రభుత్వం దుర్మార్గంగా, రాక్షసంగా వ్యవహారిస్తోందని బండి సంజయ్ ధ్వజమెత్తారు. విద్యార్థులను విచక్షణ రహితంగా కొట్టడం దారుణమని అన్నారు. ప్రభుత్వానిది చిల్లర నిర్ణయమని.. పేదల పొట్ట కొడుతారా అని బండి సంజయ్ మండిపడ్డారు. గ్రూప్-1 పరీక్ష రీ షెడ్యూల్ చేయాలని కోరారు. విద్యార్థుల బతుకులను నాశనం చేస్తారా అని నిలదీశారు. 'రాత్రంతా లాటీ చేస్తారా, మీకు కేసీఆర్‌కు తేడా ఏంటీ' అని బండి సంజయ్ ప్రశ్నించారు. 15 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చి..60 వేల ఉద్యోగాలు భర్తీ చేశామంటారా.. ఇంతకంటే సిగ్గు ఉంటుందా.. కేసీఆర్ దారిలోనే మీరూ వెళ్తారా.. కేసీఆర్, రేవంత్ రెడ్డి దొందూ దొందే..మాజీ మంత్రి కేటీఆర్‌కు కొంచెమన్నా సిగ్గుందా.. గ్రూప్-1 ఉద్యోగులకు బ్రాండ్ అంబాసిడర్ లాగా ఫోజ్ ఇస్తున్నావా. 30 లక్షల నిరుద్యోగుల ఉసురు కేసీఆర్‌కే తగులుతుంది. కేసీఆర్, కేటీఆర్‌లను ఎవరూ నమ్మరు. నేనూ అశోక్ నగర్‌కు వెళ్తా. నిరుద్యోగుల కంటే నాకు కేంద్ర మంత్రి పదవి ఎక్కువ కాదు' అని బండి సంజయ్ అన్నారు.

## సుప్రీంకోర్టు కేసుల విచారణ లైవ్ స్ట్రీమింగ్

(మొదటి తరువాయి)

లోటుపాట్లను సవరించి త్వరలో అమలులోకి తీసుకురానున్నారు. ఇప్పటికే అంటే సరిగ్గా రెండేళ్ల క్రితం రాజ్యాంగ ధర్మాసనం కేసుల విచారణ ప్రత్యక్ష ప్రసారం ప్రారంభమైంది. యూట్యూబ్ వేదికగా వాటిని ప్రసారం చేస్తున్నారు. ప్రత్యక్ష ప్రసారంలో తొలి విచారణ 'సేన లబ సేన' కేసుపై జరిగింది. మహారాష్ట్ర శివసేన పార్టీలో శిందే వర్గం తిరుగుబాటు, ఠాక్రే నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం కూలిపోవడం వంటి పరిణామాలపై సుప్రీంకోర్టులో అనేక పిటిషన్లు దాఖలయ్యాయి. అసలైన శివసేన తమదేనంటూ ఠాక్రే, శిందే వర్గాల మధ్య పోరు నెలకొన్న నేపథ్యంలో ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరిపింది. కేసుల విచారణలను లైవ్ స్ట్రీమింగ్ చేయడానికి అనుకూలంగా సుప్రీంకోర్టు 2018లోనే నిర్ణయం తీసుకున్నప్పటికీ.. ఆచరణలోకి రాలేదు. అయితే, భారత మాజీ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఎన్.వి.రమణ పదవీ విరమణ రోజు.. ఆయన నేతృత్వంలోని ధర్మాసనం కార్యకలాపాలను దేశ ప్రజలంతా వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. సుప్రీంకోర్టు కార్యకలాపాలను ప్రత్యక్ష ప్రసారం చేయడం అదే తొలిసారి. ఆ తర్వాత రాజ్యాంగ ధర్మాసనం విచారణలను లైవ్ స్ట్రీమింగ్ చేయాలని రెండేళ్ల క్రితం నిర్ణయం తీసుకున్నారు. ఈ చారిత్రక నిర్ణయంతో పౌరసత్వ సవరణ చట్టం, ఆర్టికల్ 370 వంటి కీలక కేసులకు సంబంధించిన విచారణల వంటివాటిని దేశ ప్రజలంతా ప్రత్యక్షంగా వీక్షించారు.

## ముందు డ్రైనేజీ సమస్య పరిష్కరించండి

సుందరీకరణను ఎవరూ వ్యతిరేకించడం లేదని స్పష్టంచేశారు. ఇప్పుడున్న మూసీకి రెండువైపులా రిటైనింగ్ వాల్‌ను నిర్మించి అభివృద్ధి చేయవచ్చని సూచించారు. 30 ఏళ్ల క్రితం నిర్మించుకున్న పేదల ఇళ్లను కూల్చవద్దని మాత్రమే డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. ముషీరాబాద్ నియోజకవర్గంలోని గాంధీనగర్ డివిజన్ ఆంధ్రాకేఫ్ ఎక్స్ రోడ్‌లో స్థానిక ఎమ్మెల్యే గోపాల్‌తో కలిపి సేవరేజ్ లైన్‌ను కిషన్ రెడ్డి ప్రారంభించారు. 'మూసీ సుందరీకరణ పనులు చేయండి.. మూసీ పక్కన ముఖ్యమంత్రి ఇల్లు కట్టండి' మాకేమీ అభ్యంతరం లేదని ఎద్దేవా చేశారు. కష్టపడి నిర్మించుకున్న ఇళ్లను కూల్చివేసి డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తాం.. రూ.25వేలు ఇస్తాం.. ఖాళీ చేయమనడం న్యాయం కాదని హితవు పలికారు. స్థానిక ప్రజలకు ఏ ఇబ్బంది లేకుండా మూసీ సుందరీకరణ పనులు చేయవచ్చని సూచించారు.

## మూసీ పునరావాస మహిళా సంఘాలకు చేయూత

(మొదటి తరువాయి)

పూర్తి న్యాయం చేస్తుందని మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) పేర్కొన్నారు. శుక్రవారం ప్రజా భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మూసీ పరివాహక ప్రాంతాల స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ... ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి వెళ్ళేటప్పుడు జరిగే బాధను గుర్తుచేస్తూ, ఇటీవల ఖమ్మం, మహబూబాబాద్ వంటి ప్రాంతాలు వరదల వల్ల నష్టపోయాయని, అలాగే మూసీ మురికి నీటి కారణంగా అనారోగ్య సమస్యలు వచ్చాయన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆ నీటిని త్రాగదగిన స్థాయికి తీసుకు రావడానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. బాధిత మహిళలకు రూ. 2 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని, అందులో రూ. 1.40 లక్షలు సబ్సిడీగా ఉంటాయని, మిగిలిన రూ. 60 వేల రూపాయలు మూడు సంవత్సరాల్లో చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా వివిధ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు.


# సంపాదకీయం

## ఉపాధి రంగాలను బలోపేతం చేయాలి !

తెలుగు రాష్ట్రాల్లో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉంది. సమస్య కొండంతగా ఉంటే చర్యలు మాత్రం గోరంత అన్నచందంగా ఉన్నాయి. మరోవైపు ఐటి కంపెనీల్లో తీసివేతలు పెరుగుతున్నాయి. స్కిల్ లేకపోవడం వల్లనే అని తెలంగాణ సిఎం రేవంత్ ఇటీవలే ప్రకటించి, స్కిల్ వర్సిటీకి పునాది వేశారు. నిజానికి క్షేత్రస్థాయి లోనే విద్యారంగంలో మార్పులు రావాలి. విద్యార్థులు రాటుదేలేలా తర్ఫీదు ఇవ్వాలి. వారు ఎంచుకంటున్న ఆయా రంగాల్లో నిష్ణాతులను తయారు చేయాలి. అప్పుడే వారు ఏ పరిశ్రమలో అయినా రాణిస్తారు. అది ఓ పక్క జరుగుతుండగానే ఉన్న నిరుద్యోగులకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించాలి. ఉద్యోగమంటే కేవలం ప్రభుత్వ ఉద్యోగమే కాదు.. ప్రైవేట్ రంగంలోనూ వారికి అవకాశాలు కల్పించాలి. అలాగే సొంతకాళ్ల మీద నిలబడేలా ఉపాధికి అవకాశాలను పెంచాలి. బ్యాంకులు ఇతోధికంగా రుణాలు ఇచ్చేలా చేయాలి. ఇవన్నీ సాకారం కావాలంటే వ్యవసాయరంగం, అనుబంధ రంగాలు బలపడాలి. పారిశ్రామిక రంగం పురోగమించాలి. ఇవన్నీ కూడా యుద్ధప్రాతిపదికన సాగాలి. యువత ఆకాంక్షల మేరకు అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వాలు కృషి చేయాలి. ఎందుకంటే ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కొత్త ప్రభుత్వాలపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కొత్త ప్రభుత్వం వచ్చింది కాబట్టి నిరుద్యోగుల్లో ఆశ పెరిగింది. కొత్తగా పరిశ్రమలు వస్తాయి. తమకు ఉద్యోగాలు వస్తాయని ఎదురు చూస్తున్నారు. టిడిపి ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధి విషయంలో గత ప్రభుత్వంతో పోల్చినపుడు కొంత మెరుగుగా పనిచేస్తోంది. ఇప్పటికే తెలంగాణలో సిఎం సహా మంత్రులు అమెరికా తదితర దేశాలు చుట్టివచ్చారు. పరిశ్రమల ఏర్పాటుకు ఆహ్వానాలు పలికారు. ఎపి మంత్రి లోకేశ్ త్వరలో అమెరికా వెళ్లనున్నారు. పారిశ్రామక వేత్తలకు చంద్రబాబ కూడా రెడ్ కార్పెట్ పరిచారు. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' ఎపుడో వచ్చింది. ప్రభుత్వ ఖజానాలో కొంత ప్రైవేటుకు ఇచ్చి ప్రభుత్వ రంగ బ్యాంకుల చేత రుణాలు ఇప్పించిన తరువాత ప్రైవేట్ కంపెనీలు వేసే రోడ్లు, విమానాశ్రయాలు, చేసే విద్యుత్తు ఉత్పత్తి తదితర మౌలిక సౌకర్యాలు ఎవరికి అందుబాటులో ఉన్నాయి? ఎవరి మీద భారాలు పడుతున్నాయన్నది ఆలోచించాలి. పన్నలు సరళీకరణ సాగాలి. చిన్నచిన్న పనులను పెంచాలి. కంపెనీలకు మేలు చేసేలా నిర్ణయాలు ఉండరాదు. ప్రజలకు మేలు చేసేలా విధానాలు ఉండాలి. ఎస్.ఇ.జెడ్ లలో వచ్చిన కంపెనీలకు భూములు ఇచ్చి రైతులు ఆ కంపెనీల్లో కూలీలుగా మారారు. పరిశ్రమల నిర్మాణ సమయంలో వచ్చే, పోయే లారీల్లో దింపుడు, ఎత్తుడు హమాలీలయ్యారు. కోల్‌కొతా-చెన్నరు రహదారి పక్కన తమిళనాడు సరిహద్దులో ఉన్న పేరు మోసిన ఎస్.ఇ.జెడ్.లో భూములు కోల్పోయిన రైతులు గతిలేక ఎస్.ఇ.జెడ్ భూముల్లోకి గొడ్లు రాకుండా చూసుకునే కూలీలుగా మారడానికి కూడా సిద్ధపడుతున్నారు. గంగవరం పోర్టులాంటి వాటికోసం, విశాఖ ఉక్కు కోసం భూములు త్యాగాలు చేసిన వారు ఏమవుతున్నారు. ఈ దిశగా ప్రభుత్వాలు ఆలోచన చేయాలి. తెలంగాణలో మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ లాంటి వాటికి భూములు ఇచ్చిన రైతులు ఇవాళ దిక్కులేకుండా పడివున్నారు. ఇలాంటి అభివృద్ధి ఎవరి కోసమన్నది కూడా ఆలోచన చేయాలి. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఎస్.ఇ.జెడ్ లో ఉన్న ఒక కంపెనీలో భూములు ఇచ్చిన రైతు కుటుంబాలకు చెందిన 70 శాతం మంది కార్మికులుగా చేరారు. కానీ 12 సంవత్సరాల తర్వాత కూడా కంపెనీ వారిని కార్మికులుగా కూడా గుర్తించడంలేదు. నైపుణ్యాన్ని బట్టి వేతనాలు ఇవ్వలేదు. కంపెనీ చేసిన ఆర్థిక తప్పిదానికి ప్రస్తుతం మూతపడింది. భూములు ఇచ్చిన కార్మికుల రెక్కలు ముక్కలయ్యాయి.ప్రజల భాగస్వామ్యం ఉన్నా ఏమీ మెరుగ్గా ఒరగబెడుతుందో ప్రభుత్వం చెప్పాలి. నిజంగా చెప్పాలంటే ప్రభుత్వాలు ఏకపక్షంగా పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమే పని చేస్తున్నాయి. యూనియన్లు పెట్టుకోనివ్వటం లేదు. అలా ముందుకు వచ్చిన వారిని ఉద్యోగాల నుండి తొలగిస్తున్నారు. ప్రైవేట్ పరిశ్రమల్లో గుర్తింపు ఎన్నికలు మూలపడ్డాయి. తనిఖీలను ఎత్తివేశారు. కార్మికుల భద్రతను గాలికొదిలేశారు. అంటే వెట్టి చాకిరీ చేయించుకునే వ్యవస్థను ప్రభుత్వమే ప్రోత్సహిస్తోందని అర్థం చేసుకోవాలి. నీస వేతన చట్టం ప్రకారం 5 సంవత్సరాలకు ఒకసారి కార్మికులు వేతనాలు పెంచాలి. ఆయా కంపెఈల్లో వేతనాలను కూడా నైపుణ్యాలకు తగినట్లుగా ఇవ్వటం లేదు. అదానీ పోర్టులో కూడా ఇదే పరిస్థితి. కార్మికులను కదలకుండా చేయటానికి పోర్టుల్లో, ఎస్.ఇ.జెడ్ లలో పోలీసు స్టేషన్లు వచ్చాయి. యూనియన్లకు ప్రవేశం లేదు. విడివిడిగా ఉండే ప్రైవేట్ పరిశ్రమలన్నింటిలో కూడా ఇదే పరిస్థితి. అంటే భూములతో పాటు అన్ని వసతులు కల్పిస్తే లాభపడుతున్నది కేవలం పరిశ్రమల యజమానులే తప్ప ప్రజలు కాదని ప్రభుత్వాలు గుర్తించాలి. ఇలాంటి పరిస్థితులు కల్పించే కంపెనీలను దగ్గరకు రాకుండా చూడాలి. ప్రభుత్వమైనా ఆ పథకం ఇస్తాం, ఈ పథకం ఇస్తామని మభ్యపెడుతున్నాయి తప్పిస్తే కార్మికులకు వేతనాలు పెంచుతాం, కార్మిక హక్కులను కాపాడతామని చెప్పటం లేదు. నిజానికి పరిశ్రమలు పెట్టేది ప్రజలకు ఉదద్యోగ ఉపాధి అవకాశాలు పెంచడానికే అని గుర్తించాలి. పెత్తందార్లను తయారు చేసి ప్రజలను వెట్టి చాకీరీ చేయించుకోవడానికి కాదని ప్రభుత్వాలు గుర్తించాలి. అలాంటి వారి కోసం రైతులు ఎందుకు భూములు త్యాగం చేయాలి. ఎందుకు కూలీలుగా మారాలి అన్నది గుర్తించాలి. అలాకాకుండా భూముల్లో బంగారం పండించేలా రైతులను ప్రోత్సహించాలి. వ్యవసాయ అనుబంధరంగాలను ప్రోత్సహించాలి. పర్యావరణం కూడా పరిగణనలోకి తీసుకోవాలి. అలా చేస్తేనే ఉపాధి ఉద్యోగ రంగాలు బలపడతాయని గుర్తించాలి.

# మోదీజీ, హిమాలయాల ఘోష వినరా?

హిమాలయ ప్రాంతాల, ప్రజల అభివృద్ధి విషయమై మనకు ఒక సమగ్ర విధానం ఉన్నదా? స్వాతంత్ర్య తొలి దశాబ్దంలోనే సమగ్ర 'హిమాలయన్ విధానం' భారత్‌కు అవసరం అని డాక్టర్ రామ్‌మనోహర్ లోహియా నొక్కి చెప్పారు ఇంజినీర్, పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్ చుక్ నేతృత్వంలో లేహ్ నుంచి న్యూఢిల్లీకి లద్దాఖ్ వాసుల చరిత్రాత్మక పాదయాత్ర ప్రస్తుత పాలకులకు లోహియా డిమాండ్‌ను గుర్తుచేసేందుకు తోడ్పడవచ్చు. భారత్, చైనా సరిహద్దుల్లోని భారత పౌరులు నెల రోజుల పాటు 1000 కిలోమీటర్లు నడిచి తమ జాతీయ రాజధానికి చేరుకున్నప్పుడు వారు చెప్పదలుచుకున్నది వినడం దేశ పాలకుల కనీస ధర్మం కాదూ? అయితే జరిగిందేమిటి? ఢిల్లీలో హఠాత్తుగా సెక్షన్ 144 విధించి, వందల మైళ్ల దూరం నడిచి వచ్చిన లద్దాఖ్ ప్రజలను చట్టబద్ధమైన కారణం లేకుండానే నిర్బంధించారు. గాంధేయ పద్ధతుల్లో నిరసన దీక్ష నిర్వహించేందుకు అనుమతి నిరాకరించారు. లద్దాఖ్ భవన్‌లో నిర్బంధితులు అయిన సోనమ్ వాంగ్ చుక్ అక్కడే నిరసన దీక్ష ప్రారంభించి కొనసాగిస్తున్నారు. తమకు సంఘీభావంగా దీక్షలో పాల్గొనాలని ఇతరులను వాంగ్ చుక్ ఆహ్వానిస్తే పోలీసులు ఆయన మద్దతుదారులపై విరుచుకుపడి పలువురిని నిర్బంధించారు. లద్దాఖ్ పౌర సమాజ సమూహాలు అయిన లేహ్ అపెక్స్ బాడీ (ఎల్‌పిబి), కార్గిల్ డెమొక్రాటిక్ అలయెన్స్ (కెడిఏ) ఆధ్వర్యంలో లద్దాఖీలు ఎన్నో నెలలుగా ఆందోళన చేస్తున్నారు. అయినా వారి సమస్యలు, డిమాండ్లను విశాల భారతావని పట్టించు కోవడమే లేదు. ఇటీవలి కాలంలో హిమాలయన్ ప్రాంతాలలో సంభవించిన వివిధ ఘటనలపై మనం సుసంగతమైన అవగాహన పెంపొందించుకోవల్సిన అవసరమున్నది. లద్దాఖ్‌లో పెల్లుబికిన ప్రజల నిరసన వాటిలో ఒకటి మాత్రమే. ఇతర ఘటనలు: అధికరణ 370 రద్దు అనంతరం కశ్మీర్‌లో సంభవిస్తున్న పరిణామాలు, ఉత్తరాఖండ్‌లో భారీ భూపాతాలు, నేపాల్‌లో ప్రభుత్వం మార్పు, సిక్కింలో వెల్లువెత్తిన ఆకస్మిక వరదలు, చైనాకు భూటాన్ సన్నిహిత మవడం, అసోంలో ఎన్‌పిఆర్ కల్లోలం, మణిపూర్‌లో అంతర్యుద్ధం మొదలైనవి. ఈ ఉపద్రవాలు అన్నిటినీ మనం సమగ్ర, నిష్పాక్షిక దృక్పథంతో అర్థం చేసుకోవాలి. మరి మనం వాటిని భౌమ రాజకీయ, అంతర్గత భద్రత, ప్రాకృతిక విపత్తు, జాతుల వైరంకు సంబంధించిన ఘటనలుగా భావిస్తున్నాం. అయితే హిమాలయ ప్రాంతాలు, రాజ్యాల మధ్య పరస్పర సంబంధాలు, అవి ఎదుర్కొంటున్న సమస్యలపై ఒక



సమగ్ర దృక్పథాన్ని పెంపొందించుకోవాలని ఏడు దశాబ్దాల క్రితమే డాక్టర్ రామ్‌మనోహర్ లోహియా విజ్ఞప్తి చేశారు. పశ్చిమాన ఉన్న పఖ్తూనిస్తాన్ నుంచి తూర్పున ఉన్న బర్మా దాకా విశాల హిమాలయ పర్వత సీమలలోని వివిధ ప్రాంతాల, ప్రజల సమస్యల పరిష్కారానికి ఒక పరిపూర్ణ ప్రజాస్వామిక దృక్పథాన్ని అనుసరించాల్సిన అవసరమున్నదని లోహియా స్పష్టం చేశారు.స్వతంత్ర భారతదేశానికి తొలినాళ్లలోనే చైనా విస్తరణ వాదం నుంచి ముప్పు వాటిల్లిన నేపథ్యంలో హిమాలయన్ విధాన రాజకీయ కోణాలకు లోహియా ప్రాధాన్యమిచ్చారు. భారత్‌కు ఎదురవుతున్న బాహ్య, అంతర్గత సవాళ్లు ఎలా ముడివడి ఉన్నదీ ఆయన విశ్లేషించారు. భారత్ లోపల, బయట హిమాలయన్ ప్రజల ప్రజాస్వామిక హక్కుల కోసం ఆయన నిలబడ్డారు. టిబెట్, నేపాల్ పాలకులకు వ్యతిరేకంగా ఆయా దేశాల ప్రజలు చేస్తున్న పోరాటాలకు భారత్ మద్దతునివ్వాలని ఆయన ప్రతిపాదించారు. కశ్మీర్, నాగాలాండ్ తిరుగుబాటుదారులతో ప్రజాస్వామిక చర్చలు జరపాలని ఆయన వాదించారు. ఈశాన్య భారత రాష్ట్రాలలో ఆదివాసీలు, ఆదివాసీయేతరులను సామాజికంగా, భౌతికంగా వేర్వేరుగా ఉంచాలన్న వెర్రియర్ ఎల్విన్ ప్రతిపాదిత గిరిజన విధానాన్ని లోహియా తీవ్రంగా వ్యతిరేకించారు. హిమాలయన్ విధానంపై లోహియా దార్శనికత ఆ ప్రాంత ప్రజల మధ్య బహుళ సమైక్యతలను ఆకాంక్షించింది. అవి: హిమాలయన్ ప్రాంతంలోని వివిధ దేశాలలో నివసిస్తున్న ప్రజల మధ్య ఐకమత్యం, భారతదేశ పౌరులతో ఇరుగు పొరుగు దేశాల ప్రజల ఏకత్వంబీ హిమాలయ ప్రాంతాల సంస్కృతులు, సమాజాలు, విశాల భారతావనిలోని వివిధ సమాజాల, సంస్కృతుల మధ్య సమైక్యతను ఆయన ప్రగాఢంగా ఆకాంక్షించారు. హిమాలయ ప్రాంతం పట్ల లోహియా వలే శ్రద్ధాసక్తులు, సహానుభూతిని చూపిన విజ్ఞులు ఇద్దరు మాత్రమే ఉన్నారు. వారిలో ఒకరు మహా పండితుడు, మహోన్నత రచయిత, నిత్య సంచారజీవి అయిన రాహుల్ సాంకృత్యాయన్ కాగా రెండవ వ్యక్తి తాత్త్విక యాత్రికుడు కృష్ణనాథ్. హిమాలయ ప్రాంతాల పట్ల మరింత శ్రద్ధాసక్తులు చూపవలసిన అవసరం ఉన్నదనే వాస్తవాన్ని సోనమ్ వాంగ్ చుక్, ఆయన సహచరులు మనకు గుర్తుచేశారు. అంతేకాకుండా మన కాలంలో హిమాలయన్ విధానం ఎలా ఉండాలి, దాని ఉపయుక్తత ఏమిటి అనే విషయమై మన అవగాహనను విశేషంగా మెరుగుపరిచారు. ఢిల్లీ లేదా పుదుచ్చేరిలో వలే ప్రజలు ఎన్నుకున్న శాసనసభతో లద్దాఖ్‌ను కూడా ఒక పూర్తి స్థాయి రాష్ట్రం లేదా కేంద్ర పాలిత ప్రాంతంగా ఏర్పాటు చేసి లద్దాఖ్ ప్రజలకు ప్రజాస్వామిక పాలన సమకూర్చాలని వాంగ్ చుక్ డిమాండ్ చేశారు. జమ్మూ%-%కశ్మీర్‌లో తమ ఉనికి దశాబ్దాల పాటు పూర్తిగా ఉపేక్షింపబడినందున తాము ఎన్నుకున్న, తమకు జవాబుదారీగా ఉండే ప్రభుత్వ పాలనను లద్దాఖ్ ప్రజలు కోరుకుంటున్నారు. ఇది పూర్తిగా సహేతుకమైన, సానుభూతి చూపవలసిన డిమాండ్ అనడంలో సందేహం లేదు. లద్దాఖ్ జనాభా ఇంచుమించు మూడు లక్షలు మాత్రమే. అయోధ్య, హిసార్ లాంటి చిన్న పట్టణాల జనాభా కంటే ఇది ఏ మాత్రం ఎక్కువ కాదు. అయితే లద్దాఖ్ విస్తీర్ణం 59,000 చదరపు కిలోమీటర్లు. జమ్మూ కశ్మీర్ కంటే చాలా పెద్ద ప్రాంతం. మణిపూర్, మిజోరం, నాగాలాండ్‌ల మొత్తం విస్తీర్ణం కంటే లద్దాఖ్ విస్తీర్ణమే ఎక్కువ. అరుణాచల్ ప్రదేశ్‌కు ఉన్నట్లుగానే ఈ సువిశాల లద్దాఖ్‌కు కూడా లోక్‌సభలో ఇద్దరు ప్రతినిధులు, రాజ్యసభలో ఒక ప్రతినిధి ఎందుకు ఉండకూడదు? ఈ విషయంలో లద్దాఖ్ ప్రజల న్యాయబద్ధమైన ఆరాటాన్ని న్యూఢిల్లీ అర్థం చేసుకోవాలి.

# అప్పులు-ప్రయివేటీకరణ

అప్పులు మరోసారి చర్చనీయాంశమవుతున్నాయి. రాజకీయ దుమారాన్ని రేపుతున్నాయి. పాత అప్పులకు కిస్తీల కోసమే మళ్లీ రుణాలు తెస్తున్నామంటూ అధికార కాంగ్రెస్ అంటుండగా, రూ. వేల కోట్లు అప్పులు తెచ్చి ఒక్క పథకాన్ని సరిగ్గా అమలు చేయట్లేదని ప్రతిపక్ష బీఆర్ఎస్ ఆరోపిస్తున్నది. కాంగ్రెస్ సర్కారు నిధులలేమీ పేరుతో పథకాలు, ప్రాజెక్టులను ప్రయివేటుకు అప్పగించే ప్రణాళికలు చేస్తున్నదా? అనే ప్రశ్న సహేతుకమే. 'ఆడలేక మద్దెల ఓడు' అన్నట్టు పైసల్లేవని చెప్పి ఇచ్చిన రాజకీయ హామీలను తుంగలో తొక్కిన చరిత్ర బీఆర్ఎస్‌ది. ప్రజల్ని విశ్వాసంలోకి తీసుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహారాలు చేస్తే ఎవరూ ఊరుకోరు. బిల్లులు చెల్లించాలంటూ వర్కింగ్ ఏజెన్సీలు, కాంట్రాక్టర్లు, సర్పంచులు రెండేండ్లుగా ఎదురు చూస్తున్న మాట పచ్చినిజమే కదా? బీఆర్ఎస్ కాలం నుంచే పెండింగ్ బిల్లులు సమస్య ఉంది. అది నేటికీ కొనసాగుతోంది. చివరకు చోటామోటా కాంట్రాక్టర్లు, సర్పంచుల, ఎంపీటీసీలు చేసిన పనులకూ నిధుల కొరత తప్పడం లేదు. మూడేండ్ల కింద సర్పంచుల కుటుంబాలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాయి. ఒక సర్పంచ్ అసువులు బాశాడు కూడా. బడా కాంట్రాక్టర్లకు వెండిపళ్లెంలో పెట్టి బిల్లులు విడుదల చేసే ప్రభుత్వాలు, గ్రామాభివృద్ధి కోసం ఇంట్లో భార్యల పుస్తెలు తాకట్టుపెట్టి, అప్పులుచేసి పనులు చేసినవారికి నిధుల లేమిని అడ్డంకిగా చూపడం అన్యాయం.

ఈ దుర్భర పరిస్థితిని కేంద్రం చోద్యం చూస్తున్నది. సమాఖ్యతత్వాన్ని మరిచి రాష్ట్రానికి రావాల్సిన జీఎస్టీ బకాయిలు పూర్తిగా ఇవ్వకపోవడం, ఇచ్చినా అరకొరగానే విదల్చడం రొటీన్ అయి పోయింది. మోడీ సర్కార్ నుంచి రావాల్సిన సాధారణ నిధులూ తెలంగాణకు మృగ్యమవుతున్నాయి. హక్కుగా ఇవ్వాల్సిన పైసలను సైతం పెద్దన్న



పట్టించుకోకపోవడం ప్రజల జీవన హక్కును కాల రాయ డమే. ప్రస్తుతం రాష్ట్రం అప్పుల ఊబిలో ఉంది. కొత్త సర్కారు బాధ్యతలు చేపట్టిన తర్వాత మరో రూ. 49,618 కోట్ల అప్పు తీసుకుంది. మూల ధనం కింద రూ.21,881 కోట్లు ఖర్చు చేసింది. రుణమాఫీ, రైతుభరోసా, చేయూత, విద్యుత్, బియ్యం, గ్యాస్ రాయితీలు, మహాలక్ష్మి, గృహజ్యోతి స్కాలర్‌షిప్‌లు, ఆర్టీసీ, కళ్యాణలక్ష్మి పథకాల కోసం రూ.54,348 కోట్లు వ్యయమైనట్టు రాష్ట్ర ఆర్థికశాఖ ప్రకటించింది. గత ప్రభుత్వం చేసిన అప్పుల కోసం కిస్తీలు కట్టేందుకు రూ.56,440 కోట్లు వినియోగించినట్టు పేర్కొంది. ఈనేపథ్యంలో కొత్తగా అప్పులు తీసుకుంటున్నా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు కేటాయించే పరిస్థితి లేకుండా పోయిందని తెలియ జేసింది. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా లేకున్నా ఉద్యోగులకు ప్రతినెలా ఒకటో తారీఖు జీతాలు ఇస్తున్నామని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం రాష్ట్రం తాజా అప్పులు రూ.7 లక్షల కోట్లు. కేంద్రం నుంచి రావాల్సిన బకాయిలు రూ.3 లక్షల కోట్లు. బీజేపీ సర్కారు ఈ నిధులివ్వడంలో చేస్తున్న అలవికాని ఆలస్యం మూలంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఇబ్బందికర పరిస్థితుల్లో నెట్టబడుతున్నది. నాణానికి ఇదో పార్శ్వం. మరో పార్శ్వం ఏమిటంటే, కాసులు లేవనే పేరుతో ప్రాజెక్టులను, పథకాలను ప్రయివేటు, కార్పొరేట్ల ధారాదత్తం చేసే కుట్ర దాగున్నట్టు కనిపిస్తున్నది! మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును పూర్తిగా ప్రయివేటుకే ఇచ్చేందుకు సర్కారు సమాయత్తమవుతున్నది. మరో 18నెలల్లో డీపీఆర్ తయారు కానుంది. చివరకు పంచభూతాలకూ వెలకట్టే దారుణ దుస్థితి ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇందుకు ప్రపంచ దేశాల్లో సాగుతున్న ప్రత్యేక అధ్యయనాలే నిదర్శనం. నీటికి ఖరీదు కట్టే ప్రయత్నాలూ చోటుచేసుకుంటున్నాయి. 'నీటి సంక్షోభం-ఆర్థిక పరిస్థితిపై ప్రభావం' అనే అంశంపై గ్లోబల్ కమిషన్ ఆన్ ఎకనామిక్స్ ఆఫ్ వాటర్ అనే సంస్థ చేసిన అధ్యయనమే ఈ సంగతిని తేటతెల్లం చేసింది. ఆర్థిక వ్యవస్థలు బలహీనంగా ఉండటం, భూ వినియోగంలో లోపాలు, నీటి యాజమాన్యం సమర్థంగా లేకపోవడంతోపాటు వాతావరణ మార్పులు సమస్యల ను మరింత జటిలం చేస్తున్నట్టుగా అధ్యయనాలు చెబుతున్నాయి. దీంతో 50 శాతానికి పైగా ఆహారోత్పత్తి ప్రమాదంలో పడనుందని తేల్చింది. నీటి వనరుల విస్తీర్ణం తగ్గిన కారణంగా అనేక నగరాల్లో సంక్షోభస్థితి నెలకొన్నదని విశ్లేషించింది. నీటి వినియోగం మరింత సమర్థవంతంగా చేయడానికి వీలుగా తగిన ధర నిర్ణయించాలనే ప్రమాదకరమైన ప్రతిపాదనలు ముందుకొస్తున్నాయి. రేటును నిర్ణయిస్తే నీటి వినియోగంలో అనేక మార్పులు వస్తాయని డబ్ల్యూటీవో డైరెక్టర్ అభిప్రాయం. ఆర్థికవ్యవస్థలు కుదేలవుతున్న తరుణంలో ప్రయివేటు, కార్పొరేట్ రంగానికి సమస్త ప్రజల ప్రయోజనాలను తాకట్టు పెట్టే కుయత్నాలు జరుగుతుండటం ఆందోళనాకరం. వీటిని ప్రజాప్రభుత్వాలు అడ్డుకోవాలి. పేదలను నిధులలేమి పేర కష్టాల్లోకి నెట్టకుండా, ఆర్థిక ఆసరాను ఇవ్వడం ప్రాథమిక కర్తవ్యంగా భావించి ఆదుకోవాలి.

## గూడూరు బస్ స్టాండ్ అబివృద్ధి కోసం కృషి చేస్తా

-ఎంపీ బలరాం నాయక్

-రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో ఫోన్ లో మాట్లాడిన మానుకోట ఎంపీ పోరిక బలరాం నాయక్



గూడూరు ప్రజా స్వేచ్ఛ: ప్రతినిధి అక్టోబర్ 19

మహబూబాబాద్ నియోజకవర్గం గూడూరు మండలం గూడూరు మండల కేంద్రంలో బస్ స్టాండ్ ను సందర్శించిన మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు శ్రీ పోరిక బలరాం నాయక్ గారు.బస్ స్టాండ్ స్థితి గతుల పై స్వయంగా ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు.బస్ స్టాండ్ ఆవరణలో సీసీ గ్రౌండ్ వర్క్ చేయించాలని స్థానికులు ఎంపీ గారి దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారు.వెంటనే రాష్ట్ర రవాణా శాఖ మంత్రి వర్యులు శ్రీ పొన్నం ప్రభాకర్ గారితో ఫోన్లో మాట్లాడారు.మంత్రి సైతం గూడూరు బస్ స్టాండ్ అభివృద్ధి కోసం నిధులు కేటాయించి కృషి చేస్తారని హామీ ఇచ్చినట్లు బలరాం నాయక్ గారు తెలిపారు వారి వెంట గూడూరు బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కత్తి స్వామి,సీనియర్ నాయకులు మాధవపెద్ది అమరేందర్ రెడ్డి,యాకూబ్ పాషా,మండల మల్లేష్ మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు ఉన్నారు...

## బైకు యాక్సిడెంట్ లో తృటిలో తప్పిన ప్రాణాపాయం

ప్రజా స్వేచ్ఛ దినపత్రిక అక్టోబర్ 18 గంభీరావుపేట

గంభీరావుపేట మండలం కు చెందిన మంద రమేష్ ముదిరాజ్ లింగన్నపేట నుండి జాతర చూసుకొని గంభీరావుపేటకు వస్తున్న క్రమంలో వాగు వద్ద ఉన్న పెట్రోల్ బంకు దగ్గర యాక్సిడెంట్ కావడం జరిగింది తృటిలో ప్రణా అపయం తప్పడంతో అందరూ పిలుచుకున్నారు చిన్న చిన్న గాయాలు తగలడంతో హాస్పిటల్ కి పంపించడం జరిగింది



# చేర్యాల డివిజన్ కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

-జేఏసీ చైర్మన్ డా.పరమేశ్వర్

-త్వరలో ముఖ్యమంత్రి, మంత్రులను కలుస్తాం

ప్రజా స్వేచ్ఛ చేర్యాల

చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన కోసం ఐక్యంగా పోరాడుతామని జేఏసీ చైర్మన్ డా. ఆర్ పరమేశ్వర్ తెలిపారు. శుక్రవారం చేర్యాల మండల కేంద్రంలో వాసవి గార్డెన్ లో ఏర్పాటు చేసిన చేర్యాల రెవెన్యూ డివిజన్ జేఏసీ సమావేశానికి జేఏసీ వైస్ చైర్మన్ పుర్మ ఆగంరెడ్డి అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. చేర్యాల ప్రాంత అస్తిత్వం కోసం గత ఎనిమిది సంవత్సరాలుగా అనేక ధర్నాలు, ఆందోళన కార్యక్రమాలు చేసినప్పటికీ 10 సంవత్సరాలుగా అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం చేర్యాల ప్రాంతాన్ని కుక్కలు చింపిన విస్తారు లాగా విడదీసి తీవ్ర అన్యాయం చేసిందని, ఈప్రాంత ఓట్లతో రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి డివిజన్ అంశాన్ని ఏమాత్రం పట్టించుకోకుండా అన్యాయం చేశారని విమర్శించారు. గత ప్రభుత్వ మోసాల వల్లే ఎంతో నష్టం జరిగిందన్నారు. చేర్యాల ప్రాంత అస్తిత్వం, ఆత్మగౌరవం కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధమన్నారు. త్వరలో జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి తో కలిసి మంత్రులు, ముఖ్యమంత్రిని కలిసి మెమోరాండం సమర్పస్తామని తెలిపారు. చేర్యాల ప్రాంతం కోసం అన్ని రాజకీయ పార్టీలు జేఏసీలో భాగస్వాములై కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. జేఏసీ చైర్మన్ గా రామగళ్ల పరమేశ్వర్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో జేఏసీ నాయకులు కామిడి జీవన్ రెడ్డి, అందె అశోక్, ఉడుముల భాస్కర్ రెడ్డి, అందె బీరయ్య, మల్లిగారి యాదగిరి, ఒగ్గు రాజు, ఆవుశర్ల యాదయ్య, బస్వగళ్ల సిద్దయ్య, గద్దల మహేందర్, గూడా రాజిరెడ్డి, దాసరి శ్రీకాంత్, భూమిగారి రాజేందర్, ఆడెపు నరేందర్, ఓరుగంటి శంకర్, అందె నాని బాబు, ఈరి భూమయ్య, పందిళ్ల నర్సయ్య, మ్యాక మల్లేశం, కరెడ్ల రఘుపతి రెడ్డి, వెంకటాద్రి, పాల లక్ష్మీనారాయణ, మిట్టపల్లి నర్సిరెడ్డి, చెరుకు రమణా రెడ్డి, సనాది భాస్కర్, రాగుల శ్రీనివాస్ రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, గూడ రాజిరెడ్డి, జిల్లా రాజేశం, వంగపల్లి శ్రీనివాస్, జంగిలి యాదగిరి, పోతుగంటి ప్రసాద్,అంబటి అంజయ్య, రామగళ్ల నరేష్, సుందరగిరి భాస్కర్, గూడెపు సుదర్శన్, మల్లిగారి నర్సింహులు, ఎగుర్ల ఎల్లయ్య, పచ్చిమడ్ల వెంకటయ్య, ఎదుల గణేష్,పోలోజు కుమార్, మల్లిగారి సూరయ్య, బండి శ్రీనివాస్ గౌడ్, రామగళ్ల అంజయ్య, సిద్దిరాం భద్రయ్య, ఒగ్గు తిరుపతి, రమేష్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

# ఆనందోత్సవాల మధ్య సీఎం కప్ 2024 టార్చ్ రిలే ర్యాలీలు








నాగర్ కర్నూల్ వనపర్తి జిల్లా కేంద్రాల్లో సంబరంగా సాగిన క్రీడాజ్యోతి ర్యాలీలు

నాగర్ కర్నూల్ /వనపర్తి, ప్రజా స్వేచ్ఛ

సీఎం కప్2024 టార్చ్ రిలే ర్యాలీలు జోరుగా కొనసాగుతున్నాయి.శుక్రవారం నాగర్ కర్నూల్ జిల్లా వనపర్తి జిల్లా కేంద్రాల్లో యువ క్రీడాకారుల ఉత్సాహభరితమైన సందోహంతో క్రీడా ర్యాలీలు ఘనంగా కొనసాగాయి. ఉదయం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో జరిగిన టార్చ్ రిలే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి సంతోష్, జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ లు ముఖ్యఅతిథిలు గా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా కబడ్డీ,వాలీబాల్,ఫుట్ బాల్,కరాటే అసోసియేషన్ స్కూల్ గేమ్ ఫెడరేషన్ ప్రతినిధులు వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు క్రీడాకారులు పెద్ద సంఖ్యలో హాజరైనారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా యువజన, క్రీడాభివృద్ధి అధికారి సురేందర్ రెడ్డి సమన్వయం చేశారు. వనపర్తి జిల్లా కేంద్రంలో జరిగిన టార్చ్ రిలే కార్యక్రమము వందలాదిమంది యువ క్రీడాకారుల సందోహం మధ్య జిల్లా అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్, డీఎస్పీ వెంకటేశ్వరరావులు క్రీడాజ్యోతి ర్యాలీని ప్రారంభించారు. వివిధ పాఠశాలల కళాశాల విద్యార్థిని విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు ఈ కార్యక్రమాన్ని జిల్లా యువజన, క్రీడాభివృద్ధి అధికారి సీతారాములు సమన్వయం చేశారు.రేపు జోగులాంబ గద్వాల మరియు నారాయణపేట జిల్లా కేంద్రాల్లో ఈ కార్యక్రమం కొనసాగునుంది.



## ప్రయాణికులరా జెర్ర జాగ్రత్త ఆదామరిచారో అంతే సంగతి



ప్రజా స్వేచ్ఛ అక్టోబర్ 18 గంభీరావుపేట

గంభీరావుపేట మండల కేంద్రంలోని గంభీరావుపేట లింగన్నపేట మధ్యలో వాగు అవతల మద్దుల చెరువు కొమ్ము నుండి వచ్చే జాలు నీళ్ల కోసం ఎప్పుడో పురాతనమైన చిన్న రుడ్డాము ను నిర్మించడం జరిగింది. అట్టి చిన్న బ్రిడ్జి యొక్క కాల పరిమితి ముగిసినందున శిథిలావస్థకు చేరుకోవడం జరిగింది లింగన్నపేటకు వెళ్లేటప్పుడు ఎడమ చేతి వైపు కొంత బ్రిడ్జి కూలిపోయి ప్రమాదకరంగా ఉంది ఎవరన్నా ప్రయాణికులు కరెక్టే ఉంది కదా అని ప్రయాణిస్తే అందులో పడి మరణించే అవకాశాలు అనేకం ఉన్నాయి దాని చుట్టూ ఆర్ అండ్ బి అధికారులు కనీస బోర్డులు ఏర్పాటు చేయకపోవడానికి కూడా కారణం ఏమిటో తెలియదు కేవలం నాలుగు రాళ్లు అడ్డు పెట్టడం జరిగింది అట్టి గుంత కనబడకుండా చెట్ల పొద అడ్డముండడం ద్వారా దగ్గరికి వెళ్లేంతవరకు కనిపించని పరిస్థితి కాబట్టి సంబంధిత అధికారులు ప్రమాదం జరగకముందే హెచ్చరిక బోర్డులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు

# వెంకటేశ్వర స్వామి రథోత్సవం దర్శించుకున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ప్రజా స్వేచ్ఛ అక్టోబర్ 18 గంభీరావుపేట

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం లింగన్నపేటలోని శ్రీ వెంకటేశ్వర స్వామి రథోత్సవంలో భాగంగా ఈరోజు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ గారు వెంకటేశ్వర స్వామి దర్శించుకుని వేద పండితుల చేత ఆశీర్వాదం పొందడం జరిగింది అనంతరం వెంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ ఉమనగారి పాపారావు వైస్ చైర్మన్ గారు జోగు సురేష్ గారు ఆది శ్రీనివాస్ గారికి శాలువాతో సత్కారం చేసి వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని బహుకరించడం జరిగింది వీరి వెంట జిల్లా గ్రంథాలయ చైర్మన్ మాజీ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నాగుల సత్యనారాయణ గౌడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ మరియు మండల అధ్యక్షుడు హమీద్ సింగిల్ విండో డైరెక్టర్ మల్యాల రాజ్వీర్ కొత్తపెల్లి గ్రామ శాఖ అధ్యక్షులు మేడ భాస్కర్ లింగన్నపేట గ్రామ శాఖ అధ్యక్షులు కాసా శ్రీనివాస్ అంబటి ఎల్లయ్య తాజుద్దీన్ అక్క పెల్లి బాలయ్య దేసేటి రాజాశేఖర్ గంగి స్వామి తదితరులు పాల్గొన్నారు





## రథోత్సవాన్ని దర్శించుకున్న కొండూరు రవీందర్ రావు



ప్రజా స్వేచ్ఛప్రతినిధి అక్టోబర్ 18 గంభీరావుపేట

గంభీరావుపేట మండల కేంద్రంలోని లింగన్నపేట గ్రామంలో ఈరోజు శ్రీ వెంకటేశ్వర స్వామి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది ఇట్టి రథోత్సవాన్ని జాతీయ సహకార సంఘాల అధ్యక్షులు శ్రీ కొండూరు రవీందర్రావు గారు వెంకటేశ్వర స్వామిని దర్శించుకుకొన్నరు అనంతరం ఈ వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ శ్రీ ఉమ్మన్నగారి పాపారావు శాలువాతో సన్మానం చేసి వెంకటేశ్వర స్వామి చిత్రపాటాన్ని అందజేశారు అనంతరం గ్రామ పురోహితులు ఆశీర్వాదాలు అందజేశారు ఆయన వెంట బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పాపా గారి వెంకట స్వామి గౌడ్ సెస్ డైరెక్టర్ గౌరీ నేని నారాయణరావు మాజీ ఎంపీటీసీ లింగన్న గారి దయాకర్ రావు మరియు ఆంజనేయులు మాజీ ఉప సర్పంచ్ దుబాసిరాజు మాజీ ఎంపీపీ కమ్మరి సాయవ్వరాజారాం బిఆర్ఎస్ యువ నాయకుడు ఎక్స్ ఎంపిటిసి ఎగదండి స్వామి గార్లు పాల్గొన్నారు

## అభివృద్ధి స్థల సేకరణలో భాగంగా 50 వేల రూపాయలు విరాళాన్ని అందజేసిన జిల్లా గణేష్



**శేరిలింగంపల్లి అక్టోబర్ 18 ప్రజా స్వేచ్ఛ/**
ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని, ఆల్విన్ కాలనీ డివిజన్, ఎల్లమ్మ బండ దత్తాత్రేయ కాలనీలో గల శ్రీ నాగలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి స్థల సేకరణలో భాగంగా 50 వేల రూపాయలు విరాళాన్ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జిల్లా గణేష్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేర్లింగంపల్లి ఎమ్మెల్యే ఆరేకపూడి గాంధీ జన్మదిన్నాన్ని పురస్కరించుకొని ఆలయ అభివృద్ధి కోసం 50 వేల రూపాయలు విరాళంగా ఇచ్చామని తెలిపారు. ఎమ్మెల్యే ఆయురారోగ్యాలతో ఇంకా ఉన్నత పదవులు పొందాలని కోరుకుంటున్నట్టు జిల్లా గణేష్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నాగభూషణం, అరుణ్, నాయకులు పి మహేష్, వెంకటకృష్ణ, సుధాకర్,మహేష్ తదితరులు పాల్గొన్నారు

## వివాహానికి 1,0000 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించిన జిల్లా గణేష్



**శేరిలింగంపల్లి అక్టోబర్ 18, ప్రజా స్వేచ్ఛ/**
ఆల్విన్ కాలనీ 124 డివిజన్ కె టి ఆర్ కాలనీ నివాసం ఉండే సలీం కూతురు ముస్కాన్ బేగం వివాహానికి 10000 రూపాయల ఆర్థిక సహాయాన్ని జిల్లా గణేష్ అందజేశారు.

## స్థానిక సమస్యలపై పర్యటన



**శేరిలింగంపల్లి అక్టోబర్ 18 ప్రజా స్వేచ్ఛ/**
ఆల్విన్ కాలనీ 124 డివిజన్ పరిధిలోని పీజేఆర్ నగర్ కాలనీ లో డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ జి.ఎచ్.ఎం.సి అధికారులతో కలిసి పర్యటించి డ్రైనేజీ లైన్ మరమ్మత్తు పనులను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రెండు రోజుల క్రితం డ్రైనేజీ కంట్రోల్ ట్యాంక్ పొంగి కాలనీలో వరద నీరు వచ్చిన విషయం అందరికి తెలిసిందే, అయితే ఇప్పుడు ఆ వరద నీరు అంత క్లియర్ చేసిన సరే భవిష్యత్తు లో సమస్య మళ్ళీ పునరావృతం కాకుండా మ్యాన్ హిల్స్ అన్ని క్లియర్ చేసి డ్రైనేజీ లైన్ ను శుభ్రం చేయాలని అన్నారు. అలాగే కాలనీలో పెద్ద డ్రైనేజీ లైన్ నిర్మించి నీరు నిలిచిపోయే సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, జి.రవి, యాదగిరి, సంగమేష్, అగ్రవాసు, మహేష్, వాటర్ వర్క్స్ మేనేజర్ ఝాన్సీ, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్, సూపర్వైజర్ శివ తదితరులు పాల్గొన్నారు.

## రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షునిగా గందే సురేష్ ఎన్నిక



**షాద్ నగర్, అక్టోబర్ 18 పజా స్వేచ్ఛ/**
తెలంగాణ రాష్ట్ర ఆర్య వైశ్య మహాసభ రంగారెడ్డి జిల్లా అధ్యక్షునిగా షాద్ నగర్ పట్టణానికి చెందిన గందే సురేష్ ఎన్నికైనారు. శుక్రవారం హైదరాబాద్ లో జరిగిన సమావేశంలో గందే సురేష్ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం పట్ల పట్టణ ఆర్యవైశ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న సభ్యులకు ధన్యవాదాలు తెలుపుతూ, ఆర్య వైశ్యులు సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తానని అన్నారు.

# ఒకే కుటుంబంలో ముగ్గురికి ఎంబిబిఎస్‌లో ప్రవేశం పొందడం అభినందనీయం

### -విద్యార్థులను శాలవతో సత్కరించి అభినదించిన గౌరవ పి ఎస్ సి చైర్మన్ శ్రీ ఆరెకపూడి గాంధీ



**శేరిలింగంపల్లి అక్టోబర్ 18, ప్రజా స్వేచ్ఛ/**
ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ ఫేస్ 2 ప్రెసిడెంట్ శ్రీ కృష్ణ రావు కుమారుడి పిల్లలు మనవడు జయ శ్రీ గోపాల్ క్రిష్, అపోలో ఆసుపత్రి, మనవరాలు కృష్ణ శ్రీ కామినేని ఆసుపత్రి, మనవరాలు సౌమ్య మహబూబ్ నగర్ ఆసుపత్రి లో వైద్య విద్య ను అభ్యసించడానికి ప్రవేశం పొందడం జరిగినది. ఈ సందర్భంగా పి ఎస్ సి చైర్మన్ ఆరెకపూడి గాంధీ వారికి శాలవతో సత్కరించి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సంధర్భంగా పి ఎస్ సి చైర్మన్ గాంధీ మాట్లాడుతూ ఒకే కుటుంబంలో ముగ్గురు ఎంబిబిఎస్‌లో ప్రవేశ పొందడం చాలా అభినదించదగ్గ విషయం అని, కృష్ణ రావు ని వారి మనవడు మనవరాలను ప్రత్యేకంగా అభినదిస్తున్నాను అని పి ఎస్ సి చైర్మన్ గాంధీ తెలియచేసారు. పట్టుదలతో కష్టపడి చదివి తల్లిదండ్రుల కలలను సాకారం చేశారు అని. వారికి నా హృదయపూర్వక అభినందనలు తెలియచేస్తున్నాను అని , వైద్య వృత్తి ని ఎంచుకొని సమాజంలో గొప్ప వృత్తి ,ప్రాణం పోసే డాక్టర్ వృత్తి గొప్పది అని , బాగా చదువుకొని మంచి పేరు ప్రఖ్యాతులు గల డాక్టర్ లుగా సమాజంలో సేవ చేయాలని పేద వారికి, మధ్యతరగతి ప్రజలకు వైద్య సేవలు అందించెలాని పి ఎస్ సి చైర్మన్ గాంధీ ఆకాక్షించారు. విద్యార్థులు, యువత తాము ఎంచుకున్న మార్గాలలో కష్టపడి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని , ఎంచుకున్న మార్గాలలో సడలని పట్టుదల , కృషి ఉంటె సాదించలేనిది ఏది లేదు అని ,భవిష్యత్తు లో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, తల్లిదండ్రులు వారి పిల్లల అభిరుచులకు తగ్గట్టు శిక్షణ ఇప్పిస్తే వారు ఎంచుకున్న రంగాలలో అద్భుత ఫలితాలు సృష్టిస్తారు అని ,ఉన్నత శిఖరాలను అధిరోహించి మన దేశ ఖ్యాతిని నలుదిక్కుల విశ్వవ్యాప్తం చేస్తారని పి ఎస్ సి చైర్మన్ గాంధీ తెలియచేసారు.ఈ కార్యక్రమములో ఆల్విన్ కాలనీ ఫేస్ 2 ప్రెసిడెంట్ కృష్ణారావు, కట్టశ్రీనివాస్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ టి పి సి హరి హర దేవాలయంలో సుందరకాండ పారాయానం





**జ్యోతి నగర్ అక్టోబర్ 18, పజా స్వేచ్ఛ/**
శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామి వారి మరియు శ్రీ సంప్రదాయ సుధానిధి, భగవద్విషయ ప్రబోధక బిరుదాంచితులు" శ్రీ మద్వాధుల సముద్రాల వేంకటనృసింహా దేశికుల (అయోధ్య స్వామి) వారి పరిపూర్ణ మంగళాశాసనములతో నవాహ్నిక శ్రీమత్ సుందరకాండ పారాయణము, శ్రీమద్రామాయణ ప్రవచన కార్యక్రమాలు ప్రారంభమైనట్లు అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ సభ్యుడు జనగామ తిరుపతి తెలిపారు.లోక కల్యాణార్థం అఖిలాండ కోటి బ్రహాండ నాయకుడు, సర్వజగద్రక్షకుడు, జగదాభిరాముడు అయినటువంటి "శ్రీ సీతా రామచంద్ర స్వామి" వారి అనుగ్రహం కొరకై ఎన్.టి.పి.సి, జ్యోతినగర్ వైకుంఠాపురం లోని హరిహర దేవాలయంలో వేంచేసి ఉన్న శ్రీ అలివేలుమంగ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి" వారి శ్రీ చరణ సన్నిధిలో శ్రీ శ్రీమాన్ తూపురాణి శ్రీరమణి రంగాచార్యుల గారి ప్రత్యక్ష పర్యవేక్షణలో 17 అక్టోబర్ గురువారం నుండి 27వ తేది ఆదివారం వరకు సకల అభీష్ట సిద్ధి ప్రదాయక, మోక్ష ప్రదాయక, అష్టసిద్ధులు, నవనిధులు సిద్ధిజేయగల శ్రీ సుందరకాండ పారాయణము మరియు శ్రీమాన్ రంగాచార్య స్వామి వారిచే శ్రీమద్రామాయణ ప్రవచనముల కార్యక్రమము వికాస తరంగని విష్ణు సహస్ర నామ సమితి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురువారం సాయంత్రం సామూహిక శ్రీ విష్ణుసహస్ర నామ స్తోత్ర పారాయణ, విష్వక్సేన ఆరాధన, వాసుదేవ పుణ్యాహవాచనం, రక్షా బంధనం అంకురార్పణ, ఋత్విక్వరణము, కలశ స్థాపన, మంగళాశాసనము, తీర్థ ప్రసాద గోష్టి జరిగాయి .శుక్రవారం నుండి పండితులు శ్రీమాన్ తుపురాణి రమణీ రంగాచార్యులు, శ్రీమాన్ తుపురాణి లక్ష్మణ చార్యులు, శ్రీమాన్ వానమామలై రామాచార్యులు, శ్రీమాన్ వామన శర్మ , శ్రీమాన్ రాజనరేంద్ర శర్మ, శ్రీమాన్ భరద్వాజ్, శ్రీమాన్ వంశి కృష్ణమా చార్యులు , శ్రీమాన్ జయేంద్ర సరస్వతి గార్ల ఆధ్వర్యంలో నెల 27 శనివారం వరకు సామూహిక శ్రీమత్ సుందరకాండ పారాయణము,తీర్థ ప్రసాద గోష్టి, సాయంత్రం శ్రీ విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణ, శ్రీమద్రామాయణ ప్రవచనం ఉంటుంది అని అన్నారు. గురువారం అగ్ని ప్రతిష్ఠ, హవనము, నిత్య పూర్ణాహుతి శనివారం మహా పూర్ణాహుతి, పారాయణ సమాప్తి సాయంత్రం శ్రీ సీతా రామచంద్ర స్వామి వారి శాంతి కళ్యాణం ఆదివారం ఉదయం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి మహా సామ్రాజ్య పట్టాభిషేక మహొత్సవం, ఋత్విగ్ సన్మానము, మహాదాశీర్వచనము, తీర్థ ప్రసాద గోష్టి ఉంటాయి అని తెలిపారు. భగవత్బంధువులు అందరూ సకాలంలో విచ్చేసి శ్రీ సీతారామచంద్ర స్వామి పరిపూర్ణ కృప కటాక్షములను పొందగలరు అని విజ్ఞప్తి చేసారు.

# కెపిహెచ్బి డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ గంధం రాజును ఘనంగా సత్కరించిన కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు

**కూకట్ పల్లి అక్టోబర్ 18,పజా స్వేచ్ఛ/**
దసరా పండుగను పురస్కరించుకొని కూకట్ పల్లి నియోజకవర్గం కెపిహెచ్బి కాలనీ కి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి దినేష్ కుమార్, కెపిహెచ్బి డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ గంధం రాజును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కొప్పిశెట్టి గంధం మాట్లాడుతూ రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీలో మహిళ నాయకురాలదే కీలకమైన పాత్ర ఉంటుందని, కాంగ్రెస్ పార్టీలో మహిళలు సమర్ధవంతమైన పాత్ర పోషిస్తున్నారని, భారతదేశంలో కాంగ్రెస్ పార్టీ మహిళాసభ్యత్వ నమోదు కార్యక్రమంలోతెలంగాణ రాష్ట్రం మొదటి స్థానంలో ఉండడమే ఒక మంచి



ఉదాహరణ అని తెలిపారు. ఈ ఘనత సాధించిన తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు సునీతారావు కి, సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి మహిళ నాయకురాళ్ళకి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దార్ల వనజ, సుజాత, వరలక్ష్మి, వీణ, రోజా,వాణి, సరోజ, దుర్గ పాల్గొన్నారు.

# బిజినెస్

# ఐదోసారి మెటా లేఆఫ్స్.. ఈ సారి వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ ఉద్యోగులు టార్గెట్..

అమెరికాకు చెందిన టెక్ దిగ్గజం మెటా తన లేఆఫ్ స్పీ కొనసాగిస్తూనే ఉంది. 2022 నుంచి వరుసగా ఐదవసారి టెక్ దిగ్గజం తన తొలగింపులను కొనసాగిస్తోంది. అమెరికాలో ద్రవ్యోల్బణం కుదుటపడటంతో ఇటీవల ఫెడ్ చర్యలు ప్రపంచ వ్యాప్తంగా జాబ్ మార్కెట్లలో కొత్త సంతోషాన్ని నింపాయి. ఈ క్రమంలో రిక్రూట్మెంట్లు సైతం భారీగా పెరిగిన సంగతి తెలిసిందే. ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా గతంలో సోషల్ మీడియా విభాగంలో వేల సంఖ్యలో ఉద్యోగులను కత్తిరించిన సంగతి తెలిసిందే. తాజాగా కంపెనీ వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ మరియు రియాలిటీ ల్యాబ్‌లతో సహా వివిధ విభాగాలలో ఉద్యోగులను తొలగించడం మెటా ప్రారంభించింది. ఈ కోతలు నిర్దిష్ట జట్లలో పునర్నిర్మాణానికి సంబంధించినవి. 2023లో మెటాస్ థ్రెడ్స్ టీమ్‌లో చేరడానికి ముందు ప్రకటించని యాప్ ఫీచర్లను వెలికితీసేందుకు ప్రసిద్ధి చెందిన జేన్ మంచున్ వాంగ్ వంటి కొంతమంది ఉద్యోగులు తమ తొలగింపుల గురించి బయటకు చెప్పటంతో విషయం బయటకు వచ్చింది. ప్రస్తుతం కంపెనీ తన దీర్ఘకాలిక లక్ష్యాలకు




అనుగుణంగా వనరులను తిరిగి కేటాయిస్తోందని మెటా ప్రతినిధి డేవ్ ఆర్నాల్డ్ వెల్లడించారు. ఇందులో ఉద్యోగులను వేరువేరు పాత్రల్లోకి మార్చటం ఉంటాయన్నారు. లేఆఫ్ వల్ల ఎఫెక్ట్ అయిన ఉద్యోగులకు కంపెనీలో అందుబాటులో ఉన్న ఇతర రోల్స్ ఫిట్ చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. కరోనా తర్వాత 2022 నుంచి ఆశించిన స్థాయిలో వృద్ధి లేకపోవటంతో మెటా లేఆఫ్స్ కొనసాగిస్తోంది. ఈ లేఆఫ్ ప్రయాణాన్ని కంపెనీ తొలుత 11,000 మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు చేసిన ప్రకటన నుంచి స్టార్ట్ అయ్యింది. అలాగే 2023లో సీఈవో జుకర్ బర్గ్ మరో 10,000 మంది ఉద్యోగుల తొలగింపులను ప్రకటించింది. ఇదే క్రమంలో కంపెనీ తన లాస్ ఏంజెలెస్ ఆఫీసులో దాదాపు రెండు డజన్ల మంది ఉద్యోగులను తొలగించినట్లు ఫైనాన్షియల్ టైమ్స్ ప్రచురించింది. ఉద్యోగులకు మెటా అందించిన 25 డాలర్ల మీల్ క్రెడిట్లను ఇంటికి అవసరమైన వస్తువులను కొనుగోలు చేసేందుకు వినియోగించినందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడైంది. అయితే ఈ తొలగింపులు కంపెనీలో కొనసాగుతున్న రీస్ట్రక్చరల్ లేఆఫ్స్‌కి సంబంధం లేదని పేర్కొనబడింది. గతంలో జూకర్ బర్గ్ కంపెనీ మరింతగా ముందుకు తీసుకెళ్లే క్రమంలో అవసరమైతే మరిన్ని తొలగింపులు ఉంటాయని పేర్కొనగా, ప్రస్తుత పరిస్థితులు దానికి అనుగుణంగానే జరుగుతున్నట్లు తెలుస్తోంది. జుకర్‌బర్గ్ 2023ని 'సమర్థత సంవత్సరం' అని పిలిచిన ఒక సంవత్సరం తర్వాత తాజా పరిణామాలు కొనసాగుతున్నాయి. ప్రధానంగా ఖర్చులను తగ్గించి లాభదాయకతను పెంచాలని మెటా చూస్తున్నట్లు నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## సెంట్రల్ బ్యాంక్ లాభాలు 51 శాతం వృద్ధి

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జులై నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికం (క్యూ2)లో 50.91 శాతం వృద్ధితో రూ.913 కోట్ల నికర లాభాలు సాధించింది. నికర వడ్డీ ఆదాయం, రద్దు చేసిన ఖాతాల రికవరీల్లో పెరుగుదల లాభాల వృద్ధికి ప్రధాన మద్దతును అందించాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.605 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.8,412 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం.. గడిచిన క్యూ2లో 9,849 కోట్లకు చేరినట్లు ఆ బ్యాంక్ రెగ్యూలేటరీ ఫైలింగ్‌లో వెల్లడించింది. క్రితం క్యూ2లో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం 3,410 కోట్లకు పెరిగిందని తెలిపింది. 2023-24 ఇదే క్యూ2లో రూ.3,028 కోట్ల ఎన్ఐఐ నమోదయ్యింది. 2024 సెప్టెంబర్ ముగింపు నాటికి బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 4.59 శాతానికి తగ్గాయి. గతేడాది ఇదే కాలం నాటికి 4.62 శాతం నిరర్థక ఆస్తులు చోటు చేసుకున్నాయి.

### యాక్సిస్ బ్యాంక్‌కు రూ,6,918 కోట్ల లాభాలు

ప్రయివేటు రంగంలోని యాక్సిస్ బ్యాంక్ 2024-25 సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో 18 శాతం వృద్ధితో రూ.6,918 కోట్ల నికర లాభాలు ప్రకటించింది. బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం 9 శాతం పెరిగి రూ.13.483 కోట్లుగా నమోదయ్యింది. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 29 బేసిస్ పాయింట్లు తగ్గి 1.44 శాతంగా చోటు చేసుకున్నాయి


# 4 ఎన్‌బీఎఫ్‌సీలపై ఆర్‌బీఐ వేటు

అడ్డగోలుగా నిబంధనలను తుంగలో తొక్కుతున్న నాలుగు నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ)లపై భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) వేటు వేసింది. బెంగళూరు కేంద్రంగా పనిచేసే నవీ ఫిన్‌సర్వ్ లిమిటెడ్, ఢిల్లీ కేంద్రంగా ఉన్న డీఎంఐ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్, కోల్‌కతా కేంద్రంగా పని చేసే ఆరోహణ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్, చెన్నైకి చెందిన ఆశీర్వాద్ మైక్రో ఫైనాన్స్ లిమిటెడ్ అనే నాలుగు ఎన్‌బీఎఫ్‌సీలు కొత్తగా రుణాల మంజూరు, పంపిణీ చేయకుండా నిషేధం విధించింది. ఈ నెల 21వ తేదీ నుంచి ఈ నిషేధం అమల్లోకి వస్తుంది.



# చరిత్ర సృష్టించిన విరాట్ కోహ్లీ..


టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ చరిత్ర సృష్టించాడు. టెస్ట్ క్రికెట్‌లో 9 వేల పరుగుల మైలురాయిని పూర్తి చేసుకున్నాడు. ఈ ఘనతను అందుకున్న భారత నాలుగో బ్యాటర్‌గా చరిత్రకెక్కాడు. న్యూజిలాండ్‌తో బెంగళూరు వేదికగా జరుగుతున్న తొలి టెస్ట్ రెండో ఇన్నింగ్స్‌లో విరాట్ కోహ్లీ హాఫ్ సెంచరీ చేయడం ద్వారా ఈ ఫీట్ సాధించాడు. న్యూజిలాండ్ బౌలర్ విలియమ్ వేసిన 42 ఓవర్‌లో సింగిల్ తీసిన కోహ్లీ టెస్ట్‌ల్లో 9000 పరుగుల మైలురాయిని పూర్తి చేసుకున్నాడు. 53 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద ఈ ఫీట్ సాధించాడు. టీమిండియా తరఫున టెస్ట్‌ల్లో అత్యధిక పరుగులు చేసిన జాబితాలో సచిన్ టెండూల్కర్(15921), రాహుల్ ద్రవిడ్(13265), సునీల్ గవాస్కర్(10122) విరాట్ కోహ్లీ కన్నా ముందున్నారు. అయితే 9వేల పరుగుల మైలురాయిని అందుకున్న స్లోయెస్ట్ బ్యాటర్‌గా కోహ్లీ అప్రతిష్టను మూటగట్టుకున్నాడు. కోహ్లీ 197 ఇన్నింగ్స్‌ల్లో 9వేల పరుగుల మైలురాయిని అందుకుంటే.. రాహుల్ ద్రవిడ్ 176 ఇన్నింగ్స్‌ల్లో, సచిన్ టెండూల్కర్ 179 ఇన్నింగ్స్‌ల్లో, సునీల్ గవాస్కర్ 192 ఇన్నింగ్స్‌ల్లోనే ఈ ఫీట్ సాధించారు. ఇక



అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక 50 ప్లస్ రన్స్ చేసిన రెండో బ్యాటర్‌గా విరాట్ కోహ్లీ నిలిచాడు. ఇప్పటి వరకు 596 ఇన్నింగ్స్‌లు ఆడిన కోహ్లీ 221 సార్లు 50 ప్లస్ రన్స్ చేశాడు. ఈ జాబితాలో సచిన్ టెండూల్కర్ 264 ఫిఫ్టీ ప్లస్ స్కోర్లతో టాప్‌లో కొనసాగుతున్నాడు. నెంబర్-3లో విరాట్ కోహ్లీకి ఇదే ఫస్ట్ హాఫ్ సెంచరీ కావడం విశేషం. ఈ టెస్ట్‌కు ముందు విరాట్ కోహ్లీ మూడో స్థానంలో 6 మ్యాచ్‌లు ఆడి 97 పరుగులే చేశాడు. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లోనూ డకౌటయ్యాడు. దాంతో అతన్ని మూడో స్థానంలో పంపించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. కానీ రెండో ఇన్నింగ్స్‌లో కోహ్లీ కీలక ఇన్నింగ్స్ ఆడాడు. సర్ఫరాజ్ ఖాన్‌తో కలిసి మూడో వికెట్‌కు 136 పరుగులు జోడించాడు. ఈ మ్యాచ్‌లో టీమిండియా పోరాడుతోంది. 356 పరుగుల భారీ లోటుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన టీమిండియా మూడో రోజు ఆట ముగిసే సమయానికి 49 ఓవర్లలో 3 వికెట్లకు 231 పరుగులు చేసింది. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ(63 బంతుల్లో 8 ఫోర్లు, సిక్స్‌తో 52), స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ(102 బంతుల్లో 8 ఫోర్లు, సిక్స్‌తో 70), సర్ఫరాజ్ ఖాన్(78 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లతో 70 బ్యాటింగ్) హాఫ్ సెంచరీలతో సత్తా చాటారు. సెంచరీ దిశగా సాగిన విరాట్ కోహ్లీ.. మూడో రోజు ఆటలోని చివరి బంతికి కీపర్ క్యాచ్‌గా వెనుదిరిగాడు. న్యూజిలాండ్ బౌలర్లలో ఆజాజ్ పటేల్ రెండు వికెట్లు తీయగా.. గ్లేన్ ఫిలిప్స్ ఓ వికెట్ పడగొట్టాడు. టీమిండియా ఇంకా 125 పరుగుల వెనుకంజలో ఉంది. తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియా 46 పరుగులకు ఆలౌటవ్వగా.. న్యూజిలాండ్ 402 పరుగుల భారీ స్కోర్ చేసిన విషయం తెలిసిందే.

# తొలి టెస్టు మ్యాచ్‌లో గాయపడ్డ బుమ్రా

న్యూజిలాండ్‌తో శుక్రవారం జరుగుతున్న తొలి టెస్టు మ్యాచ్‌లో భారత ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా గాయపడ్డాడు. అయితే.. అతనికి గాయం ఎంత తీవ్రంగా ఉందనే దానిపై బీసీసీఐ అప్‌డేట్ ఇవ్వలేదు. ఇప్పటికే.. మోకాలి గాయం కారణంగా రిషబ్ పంత్ ఆటకు దూరంగా ఉండటంతో టీమ్ మేనేజ్‌మెంట్‌లో ఆందోళన పెరిగింది. బుమ్రా వేలికి గాయమైనప్పటికీ.. మూడో రోజు లంచ్ బ్రేక్ తర్వాత బుమ్రా బౌలింగ్ చేశాడు. వేలి నుంచి రక్తం వచ్చినా.. చికిత్స అనంతరం బౌలింగ్ చేశాడు. న్యూజిలాండ్ ఇన్నింగ్స్ 86వ ఓవర్‌లో లంచ్ తర్వాత ఫిజియో మైదానంలో కనిపించాడు. ఆ తర్వాత భారత మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ కామెంట్రీ సమయంలో ఫాస్ట్ బౌలర్ మధ్య వేలు కోసుకుపోయి రక్తస్రావం



అవుతుందని చెప్పాడు. నొప్పితోనే బుమ్రా ఆ ఓవర్ పూర్తి చేశాడు. మళ్లీ ఓవర్ బౌలింగ్ చేయడానికి వచ్చినప్పుడు అతని వేలికి టేప్‌తో కనిపించింది.

# స్పోర్ట్స్

## స్టన్నింగ్ షాట్‌తో ఆకట్టుకున్నాడు



టీమిండియా యువ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ స్టన్నింగ్ షాట్‌తో ఆకట్టుకున్నాడు. న్యూజిలాండ్‌తో బెంగళూరు వేదికగా జరుగుతున్న తొలి టెస్ట్‌లో సర్ఫరాజ్ ఖాన్ కళ్లు చెదిరే ర్యాంప్ షాట్ ఆడాడు. తొలి ఇన్నింగ్స్‌లో డకౌటైన సర్ఫరాజ్ ఖాన్.. రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం హాఫ్ సెంచరీతో ఫామ్‌లోకి వచ్చాడు. విరాట్ కోహ్లీతో కలిసి మూడో వికెట్‌కు 136 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. వికెట్‌పై బ్రేక్ డ్యాన్స్ చేస్తూ బంతిని బౌండరీకి తరలించాడు. టీ20 తరహా బ్యాటింగ్‌తో న్యూజిలాండ్ బౌలర్లపై విరుచుకుపడిన సర్ఫరాజ్ ఖాన్.. 42 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే విలియమ్ ఓ రూర్కే వేసిన 27వ ఓవర్‌లో సర్ఫరాజ్ ఖాన్ ఆడిన ఓ షాట్ నెట్టింట వైరల్‌గా మారింది. 'ఇదెక్కడి షాట్ రా అయ్యా'అంటూ నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు. ఈ ఓవర్ చివరి బంతిని విలియమ్ లో-బౌన్సర్‌గా వేయగా.. సర్ఫరాజ్ ఖాన్ వెనక్కి వంగా అప్పర్ కట్ షాట్ ఆడాడు. దాదాపు నేలకు తాకేలా కిందికి వంగి ఆడిన ఈ షాట్.. అందర్నీ ఆశ్చర్యపరిచింది. బంతి కీపర్ తలపై నుంచి బౌండరీ దూసుకెళ్లింది. ఈ షాట్ చూసి అందరూ అవాక్కయ్యారు. ప్రస్తుతం ఈ షాట్‌కు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. పిచ్ బ్రేక్ డ్యాన్స్ చేస్తున్నాడని నెటిజన్లు సెటైర్లు పేల్చుతున్నారు. ఇదే ఓవర్ నాలుగో బంతిని సర్ఫరాజ్ ఖాన్ అప్పర్ కట్‌తోనే సిక్సర్ బాదాడు. 7 ఫోర్లు, 3 సిక్సర్లతో సర్ఫరాజ్ ఖాన్ వేగంగా పరుగులు చేశాడు. ఈ మ్యాచ్‌లో టీమిండియా పోరాడుతోంది. 356 పరుగుల భారీ లోటుతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన టీమిండియా మూడో రోజు ఆట ముగిసే సమయానికి 49 ఓవర్లలో 3 వికెట్లకు 231 పరుగులు చేసింది. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ(63 బంతుల్లో 8 ఫోర్లు, సిక్స్‌తో 52), స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ(102 బంతుల్లో 8 ఫోర్లు, సిక్స్‌తో 70), సర్ఫాజ్ ఖాన్(78 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లతో 70 బ్యాటింగ్) హాఫ్ సెంచరీలతో సత్తా చాటారు. సెంచరీ దిశగా సాగిన విరాట్ కోహ్లీ.. మూడో రోజు ఆటలోని చివరి బంతికి కీపర్ క్యాచ్‌గా వెనుదిరిగాడు. న్యూజిలాండ్ బౌలర్లలో ఆజాజ్ పటేల్ రెండు వికెట్లు తీయగా.. గ్లేన్ ఫిలిప్స్ ఓ వికెట్ పడగొట్టాడు. టీమిండియా ఇంకా 125 పరుగుల వెనుకంజలో ఉంది. తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియా 46 పరుగులకు ఆలౌటవ్వగా.. న్యూజిలాండ్ 402 పరుగుల భారీ స్కోర్ చేసింది.




Printed, published and Owned by Tarigoppula Mahender, Printers Karshak Art Printers,Hyderabad
and Published by office 2-6-376, Jaipuri Colony, Nagole Village, Uppal Mandal, District Ranga Reddy,Post GSI, 500068-Telangana
RNI No. APTEL/2012/46853. E Mail. ID: prajaswecha@gmail.com, Web Site, www.prajaswecha.com cell 9381910611,7989289492